ప్రజాశక్తి

బుధవారం 31 జనవరి 2024

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి





నగరానికి చేరుకున్న క్రికెటర్లు

భారత్, ఇంగ్లండ్ మధ్య వచ్చే నెల 2 నుంచి విశాఖలోని ఎసిఎ విడిసిఎ క్రికెట్ స్టేడియంలో జరగనున్న టెస్టు మ్యాచ్ కోసం క్రికెటర్లు మంగళవారం నగరానికి చేరుకున్నారు. ఇరు జట్ల క్రీడాకారులకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేశారు.

ఇంగ్లండ్ క్రీడాకారులు

ల్యాండ్ ఫిల్ వద్దే వద్దు

- ప్రజాభిప్రాయ సేకరణలో స్థానికుల వ్యతిరేకత
- తాడిని తరలించాలని డిమాండ్
- ఎన్‌జిటి కేసును పరిగణనలోకి తీసుకోకపోవడం న్యాయవిరుద్ధం : లోకనాథం
- నీరు, గాలి, నేల కలుషితం : గనిశెట్టి
- వాయిదా వేయాలి: పంచకర్ల
- అదీప్‌రాజు, అమర్ వైఖరి వెల్లడించాలి: బండారు





ల్యాండ్ ఫిల్‌ను చేతులెత్తి వ్యతిరేకిస్తున్న ప్రజలు, అధికారులను ప్రశ్నిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి లోకనాథం

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి, పరవాడ విలేకరి

'తాడిలో ల్యాండ్‌ఫిల్ ఏర్పాటు చేయొద్దు. రాంకీ ప్రయోజనాల కోసం ప్రజల బతుకులు నాశనం చేయొద్దు. కాలుష్య బాధిత గ్రామాలకు సమాచారమివ్వకుండా నిర్వహిస్తున్న ప్రజాభిప్రాయ సేకరణను వాయిదా వేయాలి. 2013 భూ సేకరణ చట్టం ప్రకారం తాడి ప్రజలకు పరిహారం చెల్లించి, సురక్షిత ప్రాంతానికి తరలించాలి. పర్యావరణ నిబంధనలు ఉల్లంఘిస్తూ, ప్రజల అనారోగ్యాలకు కారణమైన రాంకీపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి' - అని పారిశ్రామిక వ్యర్థాల శుద్ధి నిల్వ కేంద్రం (ల్యాండ్ ఫిల్) ఏర్పాటుపై మంగళవారం కాలుష్య నియంత్రణ మండలి పరవాడ తహశీల్దార్ కార్యాలయం వద్ద నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణలో ప్రజలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు ఏకోన్ముఖంగా మిగతా 2లో..

విశాఖలో పెరుగుతున్న కోవిడ్ కేసులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖ జిల్లాలో కోవిడ్ కేసులు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ఆంధ్ర వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు మీడియాకు అందజేసిన సమాచారం ప్రకారం గత ఏడాది డిసెంబర్ 21 నుంచి జనవరి 30 వరకూ కోవిడ్ టెస్టులు 2095 నిర్వహించారు. అందులో 81 మందికి పాజిటివ్ వచ్చింది. ఇదిలా ఉండగా గడిచిన వారం రోజుల్లో కోవిడ్ సోకిన వారు 42 మంది ఉండగా వారిలో 40 మంది ఇంట్లోనే ఉండి వైద్య సేవలు పొందుతున్నారు. ఇద్దరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. గత 24 గంటల్లో 40 మందికి టెస్టులు చేయగా పది మందికి కోవిడ్ ఉన్నట్లు నిర్ధారణ అయింది.

విద్యుత్ భారాలు మోపొద్దు

మొదటి పేజీ తరువాయి..

ల్యాండ్ ఫిల్ వద్దే వద్దు

నినదించారు. ల్యాండ్‌ఫిల్‌ను వ్యతిరేకిస్తూ అక్కడకొచ్చిన ప్రజలంతా చేతులెత్తారు. సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం మాట్లాడుతూ కాలుష్య నియంత్రణ పద్ధతులు పాటించని ఫార్మా డెవలపర్ రాంకీపై ఎన్‌జిటిలో కేసువుండగా, ల్యాండ్‌ఫిల్‌పై ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించడం న్యాయ విరుద్ధమన్నారు. ఉత్తరాంధ్ర, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లోని పరిశ్రమల వ్యర్థాలను తాడి తీసుకొచ్చి, ఈ ప్రాంతాన్ని డంపింగ్ యార్డుగా చేయడం సరికాదన్నారు. ఫార్మా కాలుష్యంతో పరిసర ప్రజలు కేన్సర్, ఊపిరితిత్తులు, గర్భస్రావ సమస్యలతో బాధపడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఫార్మా కాలుష్య బాధ భరించలేక గాజువాక, ఇతర ప్రాంతాలకు వెళ్లిపోతున్నారని అన్నారు. ఐఎఎస్ అధికారులు తాడి, తానాంలో ఒక రాత్రివుంటే రాంకీ అసలు రంగు తెలుస్తుందన్నారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం తాడి ప్రజలకు పరిహారం చెల్లించి, తరలించకుండా ప్రజలను ప్రభుత్వం బాధపెడుతోందన్నారు. నిర్వాసితులకు, అర్హత కలిగిన స్థానిక యువతకు ఉద్యోగాలు ఇవ్వడం లేదని తెలిపారు. గ్రామాల్లో దండోరా ఎందుకు వేయలేదని ప్రశ్నించారు. సాగు రైతులకు పరిహారం చెల్లించకుండా భూములు తీసుకున్న ఎపిఐఐసి వాటిని రాంకీ ల్యాండ్‌ఫిల్‌కు కేటాయించడం అన్యాయమన్నారు. ల్యాండ్‌ఫిల్‌కు కేటాయించిన 50 ఎకరాలను వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజలకు హానిచేసే ల్యాండ్‌ఫిల్‌ను తమ పార్టీ వ్యతిరేకిస్తోందన్నారు. జనసేన జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు మాట్లాడుతూ తాడిని తరలించకుండా ల్యాండ్‌ఫిల్‌పై ఎందుకింత తొందరని నిలదీశారు. కాలుష్య బాధిత గ్రామాలకు సమాచారమివ్వకుండా నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణను వాయిదా వేయాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ ల్యాండ్‌ఫిల్‌తో భూగర్భ జలాలు కలుషితమవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రీన్‌బెల్ట్ స్థలాన్ని ల్యాండ్‌ఫిల్‌కు ప్రభుత్వమెలా కేటాయిస్తుందని అన్నారు. ఫార్మా కాలుష్యంతో మంచినీరు, నేల, గాలికి ప్రజలు దూరమవుతున్నారని అన్నారు. ల్యాండ్‌ఫిల్‌పై తయారు చేసిన ఇఐఎ నివేదిక వాస్తవ విరుద్ధంగా వుందన్నారు. టిడిపి నాయకులు బండారు అప్పలనాయుడు మాట్లాడుతూ తాడి తరలించడానికి విడుదల చేసిన జిఒ అమలుపై లేని శ్రద్ధ, ల్యాండ్‌ఫిల్‌పై ఎందుకన్నారు. ప్రజాభిప్రాయ సేకరణపై ఎమ్మెల్యే అదీప్‌రాజు, మంత్రి అమర్‌నాథ్ తమ వైఖరులను తెలియజేయాలని డిమాండ్ చేశారు. జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి మాట్లాడుతూ ప్రజల అభ్యంతరాలకు, లేవనెత్తిన ప్రశ్నలకు సమాధానాలిస్తామని తెలిపారు. ఈ సభలో కాలుష్య నియంత్రణ మండలి ఇఇ నాగిరెడ్డి, పరవాడ మాజీ జెడ్‌పిటిసి పైలా జగన్నాధరావు, మాజీ ఎంపిపి మాసవరపు అప్పలనాయుడు, అనకాపల్లి మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ కన్నూరు వెంకటరమణ, నీలబాబు, అట్ల సన్యాసప్పారావు, జెటి.రామారావు, ఐద్వా జిల్లా అధ్యక్షులు మాణిక్యం, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు శివాజీ, సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.శంకరరావు, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎ.రాజు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న వైద్యులు

కోవిడ్ సమయంలో వైద్యుల త్యాగనిరతి అమోఘం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : కోవిడ్ సమయంలో వైద్యులు నిరుపేదలకు వైద్యం అందివ్వడం కోసం తమ జీవితాలను త్యాగం చేశారని ఆంధ్ర వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బుచ్చిరాజు అన్నారు. కోవిడ్ అమరవీరుల దినోత్సవం సందర్భంగా మంగళవారం ఆంధ్రా మెడికల్ కాలేజీలోని ఇ-క్లాస్ రూమ్‌లో ప్రత్యేక కార్యక్రమం చేపట్టారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ విశాఖపట్నం శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వైద్యుల సంఘం, జూనియర్ వైద్యుల సంఘం సంయుక్తంగా దీనిని నిర్వహించాయి. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైద్యుల సేవలను కొనియాడారు. ఐఎంఎ విశాఖపట్నం శాఖ అధ్యక్షులు డాక్టర్ పిజె.శ్రీనివాస్ మాట్లాడుతూ కోవిడ్‌మహమ్మారి సమయంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అందించిన సేవలను వివరించారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ కోశాధికారి డాక్టర్ మురళీ మోహన్ మాట్లాడుతూ అధిక వైరల్ లోడ్ వాతావరణంలో పనిచేసే వాతావరణం కారణంగా వైద్యులు అన్ని జాగ్రత్తలు తీసుకున్నప్పటికీ డాక్టర్ సత్యమూర్తి, కెజిహెచ్ రిటైర్డ్ సూపరింటెండెంట్ డాక్టర్ గోరు సుందర్ వంటి ఎందరో ప్రముఖులను కోల్పోయామని అన్నారు. కార్యక్రమంలో కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్ కుమార్, ప్రభుత్వ వైద్యుల సంఘం అధ్యక్షులు, కెజిహెచ్ డాక్టర్ బుచ్చిబాబు, ఐఎంఎ సెక్రటరీ డాక్టర్ బాపూరావు, ఎగ్జిక్యూటివ్ మెంబర్ డాక్టర్ కెకెఎల్.ప్రసాద్, ఆంధ్రా మెడికల్ కాలేజీ సిబ్బంది, జూనియర్ డాక్టర్లు పాల్గొన్నారు.

మతోన్మాదం నశించాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : మతోన్మాదం నశించినప్పుడే భారతదేశంలో శాంతి, సౌఖ్యం వర్ధిల్లుతాయని ఇస్కఫ్ ప్రతినిధులు పేర్కొన్నారు. గాంధీ వర్ధంతిని మతసామరస్య దినోత్సవంగా జరుపుకోవాలని సమాజానికి సూచిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నాగార్జున యూనివర్సిటీ మాజీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వి.బాలమోహనదాస్, విశాఖ కో - ఆపరేటివ్ బ్యాంక్ ఛైర్మన్ చలసాని రాఘవేంద్రరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతి పిత గాంధీజీ సిద్ధాంతాలను ప్రపంచవ్యాప్తంగా అమలు చేస్తున్న తరుణంలో మనదేశంలో మాత్రం హింస, మతోన్మాదం పెరగడం ఆందోళనకరమన్నారు.

ప్రయివేటీకరణ చర్యలు తగవు
ఎపిఇఆర్‌సి ప్రజాభిప్రాయ సేకరణలో సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రజలపై విద్యుత్ భారాలు మోపొద్దని, ప్రయివేటీకరణ చర్యలను నిలిపివేయాలని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు కోరారు. ఆంధ్రప్రదేశ్ విద్యుత్ రెగ్యులేటరీ కమిషన్ 2024-25కి సంబంధించి వార్షికాదాయ అవసర నివేదిక (ఎఆర్ఆర్) ఐదో కంట్రోల్ పీరియడ్‌కు సంబంధించి మల్టీ ఇయర్ టారిఫ్ (ఎంవైటి) గురించి వర్చువల్ పద్ధతిలో ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టగా విశాఖలోని ఎపిఇపిడిసిఎల్ ఎస్ఇ ఆఫీస్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎపిఇఆర్‌సి ఛైర్మన్‌కు, కమిటీకి పలు విషయాలను విన్నవించారు. అందుకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వానికి సిఫార్సులు చేయాలని కోరారు. ఇంతటి కీలమైన అంశంపై ప్రజల విస్తృత అభిప్రాయ సేకరణ తప్పనిసరి అని పేర్కొన్నారు. కేవలం వర్చువల్‌గా జరపడం సరికాదని అన్నారు. సామాన్య, మధ్య తరగతి ప్రజలపై విద్యుత్ ఛార్జీలు పెంచబోమని రాష్ట్ర ప్రభుత్వం వాగ్దానం చేసిన విషయాన్ని గుర్తుచేశారు. దీనికి భిన్నంగా అదనపు ఛార్జీల పేరుతో ప్రజలపై పెద్దఎత్తున భారాలు వేస్తున్నారని తెలిపారు. అందుకు సంబంధించిన ఉదాహరణలను జగ్గు నాయుడు కమిషన్ ముందు ఉంచారు. విద్యుత్ బకాయిల విషయంలో సామాన్యుల పట్ల, సంపన్నుల పట్ల వ్యవహరిస్తున్న తీరును తెలియజేశారు. సామాన్యుడు ఒక నెల విద్యుత్ బిల్లు చెల్లించలేకపోతే విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నారని, అపరాధ రుసుము వసూలు చేస్తున్నారని తెలిపారు. చట్టం అందరికీ సమానమని చెబుతున్నప్పటికీ ఆచరణలో సామాన్యులకు శిక్షగానూ, సంపన్నులకు చుట్టంగానూ అమలవుతోందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలోని మూడు డిస్కాములకు సబ్సిడీలుగా చెల్లించాల్సిన బకాయి 22234 కోట్లును ఎందుకు చెల్లించడంలేదు? ఇది విద్యుత్ సంస్థను ప్రభుత్వం కావాలని బలహీనపరిచే చర్యకాదా? అని ప్రశ్నించారు. ప్రైవేటు బకాయిలు, ప్రభుత్వ బకాయిలు తక్షణమే వసూలు చేయాలన్నారు. ప్రీ పెయిడ్ స్మార్ట్ మీటర్లు బిగింపు నిలిపివేయాలని కోరారు. విద్యుత్ రంగం ప్రైవేటీకరణ జరిగితే ప్రజలపై విపరీతమైన భారాలు పడతాయని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యుత్ ఛార్జీలు పెంచబోమని, ప్రజలపై భారాలు వేయబోమని ఎపిఇపిడిసిఎల్ సిఎమ్‌డి ప్రకటించడం సంతోషమే అయినప్పటికీ ట్రూ అప్, ఇంధన సర్దుబాటు, అదనపు ఛార్జీల రద్దు సంగతేంటని ప్రశ్నించారు.





అభిప్రాయాలు వెల్లడిస్తున్న జగ్గునాయుడు, గంటా శ్రీరామ్

దొడ్డి దారిన విద్యుత్ వసూళ్లు తగవు : గంటా శ్రీరామ్

అనకాపల్లి : రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపై దొడ్డిదారిన విద్యుత్ వసూళ్లకు పాల్పడడం తగదని సిపిఎం మండల కన్వీనర్ గంటా శ్రీరామ్ అన్నారు. ఎపిఇఆర్‌సి పబ్లిక్ హియరింగ్ వర్చువల్‌గా జరగ్గా ఆయన పాల్గొని మాట్లాడారు.

రెండో రోజు అభిప్రాయాలు తెలిపినవారు 20 మంది

గ్రేటర్ విశాఖ బ్యూరో : ఎపిఇఆర్‌సి ప్రజాభిప్రాయ సేకరణలో భాగంగా రెండో రోజైన మంగళవారం 20 మంది వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వివిధ సర్కిల్, డివిజన్ కార్యాలయాల్లో పాల్గొని వారి అభిప్రాయాలను తెలియచేశారు. కార్యక్రమంలో భాగంగా ముందుగా జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా ఎపిఇపిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయ ఆవరణలో మంగళవారం ఉదయం జరిగిన కార్యక్రమంలో మహాత్మాగాంధీ కాంస్య విగ్రహానికి ఎపిఇఆర్‌సి ఛైర్మన్ జస్టిస్ సివి.నాగార్జున రెడ్డి, సభ్యులు ఠాకూర్ రామసింగ్, పివిఆర్.రెడ్డి, ఎపిఇపిడిసిఎల్ సిఎండి పృథ్వీతేజ్ ఇమ్మడి, ఎపిఎస్‌పిడిసిఎల్, ఎపిసిపిడిసిఎల్ సిఎండి కె.సంతోషరావు, సంస్థ డైరెక్టర్లు బి.రమేష్ ప్రసాద్, డి.చంద్రం, ఎవివి.సూర్యప్రతాప్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

పోలీస్ కమాండో పోటీల విజేత ఆంధ్రప్రదేశ్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ :14వ అఖిల భారత పోలీస్ కమాండో కాంపిటీషన్స్‌లో ఆంధ్రప్రదేశ్ జట్టు విజేతగా నిలిచింది. ఈ మేరకు విశాఖ నగరంలోని గ్రేహౌండ్స్ శిక్షణ కేంద్రంలో మంగళవారం జరిగిన ముగింపు వేడుకలకు ముఖ్య అతిథిగా ఇంటెలిజెన్స్ బ్యూరో అడిషనల్ డైరెక్టర్ మహేష్ దీక్షిత్ హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పోటీలు క్రీడాకారుల అంకితభావం, కృషి, పట్టుదలకు వేదికగా నిలిచాయన్నారు. గ్రేహౌండ్స్ అదనపు డిజిపి (ఆపరేషన్స్) రాజీవ్ కుమార్ మీనా మాట్లాడుతూ తాజా పోటీల్లో 16 రాష్ట్రాల జట్లు, ఏడు కేంద్ర పోలీసు సంస్థల జట్లు నుంచి 597 మంది క్రీడాకారులు పాల్గొన్నారని తెలిపారు. నేవిగేషన్, స్కిల్, ప్లానింగ్ అండ్ ప్రెజెంటేషన్, ఫిజికల్, ఫైరింగ్‌లలో వారికి పోటీలు నిర్వహించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఫైర్ సర్వీస్ డైరెక్టర్ జనరల్ పివి.సునీల్, జార్ఖండ్ ఎడిజిపి పివికె.ప్రసాద్, విశాఖ నగర పోలీస్ కమిషనర్ ఎ.రవి శంకర్ అయ్యర్ పాల్గొన్నారు.



విజేతగా నిలిచిన ఆంధ్రప్రదేశ్ జట్టుతో పోలీసు ఉన్నతాధికారులు

విజేతలు ఇలా..

ఈ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టు 300 పాయింట్లకుగాను 267.2 పాయింట్లు సాధించి ఓవరాల్ విజేతగా నిలిచింది. రెండో స్థానంలో మహారాష్ట్ర (252.9 పాయింట్లు), మూడో స్థానంలో రాజస్థాన్ (248.9 పాయింట్లు) నిలిచాయి. విజేతగా నిలిచిన ఆంధ్రప్రదేశ్ జట్టులోని 11 మంది ఆటగాళ్లకు, ఇద్దరు మేనేజర్లకు ఒక్కొక్కరికీ రూ.5 లక్షల నగదు ఇవ్వడంతో పాటు 3 సర్వీస్ ఇంక్రిమెంట్లను వారి సర్వీసులో కలపనున్నట్లు గ్రేహౌండ్స్ ఆపరేషన్స్ డిఐజి ప్రవీణ్ ప్రకటించారు.

ఉత్తరాంధ్రకు జగన్ ఏం వెలగబెట్టారో చెప్పాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఉత్తరాంధ్రకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఏం వెలగబెట్టారో చెప్పాలని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు, మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు ప్రశ్నించారు. మంగళవారం టిడిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ విశాఖ నుంచి భీమిలి బీచ్ వరకు ఏ స్థలాన్నైనా కబ్జా చేయకుండా జగన్ వదిలిపెట్టారా అని నిలదీశారు. ఎస్సీ యువకుడిని పొట్టన పెట్టుకున్న వ్యక్తిని పక్కన పెట్టుకుని అంబేద్కర్ విగ్రహం ఎలా ఆవిష్కరిస్తారని ప్రశ్నించారు. తాండవ రిజర్వాయర్‌కు నీరు రాకుండా చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. 99 శాతం హామీలను అమలు చేసినట్టు జగన్ చెబుతున్నారని, రైల్వే జోన్, ప్రత్యేక హోదా ఏమని ప్రశ్నించారు. సిపిఎస్ రద్దు విషయం ఏమైందన్నారు. జాబ్ కేలండర్, 2 లక్షల 30 వేల ఉద్యోగాలు ఏవి అని ప్రశ్నించారు. అనకాపల్లి పార్లమెంటు స్థానానికి టిడిపి తరుపున పోటీ చేసేందుకు తన కుమారుడు దరఖాస్తు చేసుకున్నాడని ఈ సందర్భంగా వెల్లడించారు. మాజీ ఎన్నికల అధికారి టిఎన్.శేషన్ వద్ద తన కుమారుడు రెండేళ్ల పాటు శిక్షణ పొందాడని తెలిపారు. సమావేశంలో పల్లా శ్రీనివాసరావు, గండి బాబ్జీ పాల్గొన్నారు.

రహదారి భద్రతపై అవగాహన

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలలో భాగంగా మంగళవారం ఉదయం నగరంలోని సత్యం జంక్షన్ వద్ద రవాణా శాఖ అధికారులు పోలీసు సిబ్బందితో కలిసి రహదారి భద్రతపై అవగాహన కల్పించారు. ఫ్లకార్డులను ప్రదర్శించి వాహనదారులకు పలు సూచనలు చేశారు. హెల్మెట్ ధరించి ద్విచక్ర వాహనాలు నడిపిన వారికి, సీటు బెల్టు ధరించి నాలుగు చక్రాల వాహనం నడిపిన వారికి అభినందనలు తెలుపుతూ పువ్వులు, చాక్లెట్లను పంపిణీ చేశారు. మోటారు వాహనాల తనిఖీదారులు బుచ్చిరాజు, గణేష్ రెడ్డి పాల్గొన్నారు.

సమస్యలపై మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నా

ప్రజాశక్తి -ఆనందపురం : మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం ఆనందపురం మండల విద్యాశాఖ కార్యాలయం ముందు ధర్నా చేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి మంగ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచడానికి, పిల్లలకు పౌష్టికాహారం అందించాలనే లక్ష్యాలతో ప్రారంభమైన మధ్యాహ్న భోజన పథకాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నీరుగారుస్తున్నాయన్నారు. గత 23 ఏళ్లుగా మధ్యాహ్న భోజన పథకంలో పనిచేస్తున్న కార్మికులతో ప్రభుత్వాలు వెట్టిచాకిరి చేయిస్తున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి రాకముందు పాదయాత్ర సందర్భంగా అధికారంలోకి వస్తే రూ.10 వేలు వేతనం ఇస్తామని హామీ ఇచ్చారని, ఆ హామీని అమలు చెయ్యాలని, ప్రతి నెలా 5వ తేదీ లోపు వేతనాలు, బిల్లులు ఇవ్వాలని, గ్యాస్‌ను ప్రభుత్వమే సరఫరా చెయ్యాలని, 12 నెలలకు వేతనాలు ఇవ్వాలని, మార్కెట్లో పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలు రూ.20లకు పెంచాలని, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని, వంటచేసేటప్పుడు అగ్నిప్రమాదానికి గురైన వారికి నష్టపరిహారం చెల్లించాలని, స్కూల్లో ఫస్ట్ ఎయిడ్ కిట్స్ ఏర్పాటు చేయాలని, ఇఎస్ఐ సౌకర్యం కల్పించాలని, పథకాన్ని ప్రైవేటుసంస్థలకు అప్పగించరాదని, మంచినీరు, వంటషెడ్, గ్యాస్ స్టవ్ ప్రభుత్వమే కల్పించాలని, సంవత్సరానికి రెండు జతల యూనిఫామ్ ఇవ్వాలని, 2 నెలలకు ఒకసారి వర్కర్లతో ఎంఇఒలు సమావేశాలు పెట్టాలని డిమాండ్‌చేశారు. ఈ మేరకు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఎంఇఒ కార్యాలయ సిబ్బందికి అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల నాయకులు డి.రాము, మాధవి, రత్నం, త్రినాథ, సూర్యకాంతం, నారాయణమ్మ, గౌరి తదితరులు పాల్గొన్నారు.


ఎంఇఒ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న 'మధ్యాహ్న' కార్మికులు

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం నుంచి పెందుర్తి హైవే మార్గంలో మామిడిలోవ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు అక్కడికక్కడే మృతిచెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. వేములవలస బీసీ కాలనీ చెందిన చెల్లూరి రాంబాబు (35) కారుతో పెందుర్తి వైపు వెళ్తుండగా ముందు వెళు తున్న లారీని తప్పించబోయి అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కారు ముందు భాగం నుజ్జయింది. రాంబాబుకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. కారులో ఉన్న మహిళకు గాయాలై చికిత్స నిమిత్తం కెజిహెచ్‌కు తరలించారు. రాంబాబుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ కేసును ఆనందపురం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ వెంకటరమణ

జంతు సంక్షేమంపై అవగాహన

ప్రజాశక్తి -భీమునిపట్నం : పశుసంవర్థక శాఖ ఆధ్వర్యాన జంతు సంక్షేమం, సంరక్షణ అంశాలపై స్థానిక జివిఎంసి ఉన్నత పాఠశాలలో మంగళవారం అవగాహన కల్పించారు. ఇందుకు సంబంధించి విద్యార్థులకు వ్యాస రచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. పశువైద్యశాల భీమిలి ప్రాంతీయ సహాయ సంచాలకులు డాక్టర్ బి వెంకటరమణ మాట్లాడుతూ, పశు సవర్ధక శాఖ ఆధ్వర్యాన ఈ నెల 14న ప్రారంభమైన జంతు సంక్షేమ పక్షోత్సవాలు ఈనెల 30తో ముగిసినట్లు వివరించారు. విద్యార్థి దశ నుంచి జంతువుల పట్ల ప్రేమ పెంచుకొని, వాటి సంరక్షణకు పాటుపడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం, ఉపాధ్యాయులు, లైఫ్ స్టాక్ అసిస్టెంట్ శ్రీనివాస్, పశుసవర్ధక శాఖ సహాయకులు శివకృష్ణ పాల్గొన్నారు.

టైలర్లకు పింఛను మంజూరు చేయాలి

ప్రజాశక్తి -భీమునిపట్నం : 50 ఏళ్ల పైబడిన టైలర్లకు ప్రభుత్వం పింఛను మంజూరుచేయాలని చేనేత ఐక్య వేదిక జిల్లా అధ్యక్షులు గిడుతూరి శ్రీనివాసరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. తగరపువలసలో మంగళవారం దుర్గా ఎల్లమాంబ మండల ప్రైమరీ టైలర్స్ కో ఆపరేటివ్ సొసైటీ ఆధ్వర్యాన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, టైలర్ దుకాణాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సదుపాయం కల్పించాలని, సబ్సిడీ రుణాలు ఇప్పించి ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు.

జాతీయ స్థాయి షూటింగ్ బాల్ పోటీలకు సన్ స్కూల్ విద్యార్థులు

ప్రజాశక్తి -భీమునిపట్నం : ప్రకాశం జిల్లా చీరాలలో ఈ నెల 31, ఫిబ్రవరి 1 తేదీల్లో జరుగనున్న జాతీయ స్థాయి షూటింగ్ బాల్ పోటీలకు తమ స్కూల్ నుంచి ఆరుగురు విద్యార్థులు ఎంపికైనట్లు స్కూల్ కరస్పాండెంట్ కె.శ్రీనివాసరావు తెలిపారు. వీరిని స్కూల్లో మంగళవారం ఆయన అభినందించారు. 2023 డిసెంబర్ 30, 31 తేదీల్లో ప్రకాశం జిల్లా సంత నూతలపాడు మండలంలో జరిగిన 42వ ఎపి సబ్ జూనియర్స్ బాలురు, బాలికలు అంతర్ జిల్లా షూటింగ్ బాల్ చాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు ప్రస్తుతం జాతీయ స్థాయి పోటీలకు ఎంపికవ్వడం పట్ల హర్షం వెలిబుచ్చారు. శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులను కూడా అభినందించారు.


జాతీయ స్థాయి షూటింగ్ బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

ఆరిలోవ ఎస్ఐగా వై.కృష్ణ

ప్రజాశక్తి - ఆరిలోవ : ఆరిలోవ శాంతి భద్రతల ఎస్ఐగా వై.కృష్ణ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఆరిలోవ ఎస్ఐగా విధులు నిర్వహించిన చెంగళి సూర్యనారాయణను దువ్వాడకు బదిలీ చేశారు.

నెరేళ్లవలసలో 'జగనన్న సురక్ష'

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని నెరేళ్లవలస పంచాయతీలో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. 562 మంది రోగులు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. 26 మందిని ప్రత్యేక విభాగానికి పరీక్షల నిమిత్తం పంపించారు. మిగిలిన వారికి వైద్య పరీక్షలు చేసి అవసరమైన మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రాంబాబు, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ఎస్.గిరిబాబు, మండల పార్టీ అధ్యక్షులు కోరాడ లక్ష్మణరావు, కొయ్యి సూరిబాబు, చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

బోర్డును తొలగించిన వారిపై చర్యకు వినతి

ప్రజాశక్తి -భీమునిపట్నం : తన స్థలంలో ఉన్న "నాట్ ఫర్ సేల్" బోర్డును తొలగించిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరుతూ స్థానిక ఆర్‌డిఒ కార్యాలయంలో మంగళవారం వినతిపత్రం అందజేసినట్లు పద్మనాభం మండలం బుడ్డివలస గ్రామానికి చెందిన బాధితుడు బోని అప్పలరాజు తెలిపారు. ఈ నెల 23న రాత్రి సమయంలో బుడ్డివలస లోని తన మూడున్నర సెంట్ల భూమిలో ఏర్పాటుచేసుకున్న "నాట్ ఫర్ సేల్" బోర్డును తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలని, తమ భూమికి రక్షణ కల్పించాలని కోరారు.

అప్పన్నను దర్శించిన దేవాదాయ శాఖ మంత్రి

ప్రజాశక్తి-సింహాచలం: సింహాద్రి అప్పన్నను రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ మంగళవారం దర్శించుకున్నారు. ఆలయ ఈవో సింగాల శ్రీనివాసమూర్తి ఆలయ సంప్రదాయం ప్రకారం స్వాగతం పలికారు. మంత్రి ముందుగా కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. బేడా మండపం చుట్టూ ప్రదక్షిణ చేశారు. స్వామి అంతరాలయంలోనూ, గోదాదేవి సన్నిధిలోనూ, గోత్రనామాలతో ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం ఆస్థాన మండపంలో అర్చకులు ఆశీర్వదించారు. ఆలయ అధికారులు సాలువతో సత్కరించి, స్వామివారి ప్రసాదాన్ని, చిత్రపటాన్ని అందించారు. దర్శనం అనంతరం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, త్వరలోనే పంచ గ్రామాల సమస్యను పరిష్కరిస్తామని, ఇప్పటికే ఇళ్ల మరమ్మతులకు అనుమతిలిచ్చామని తెలిపారు.

కేంద్ర ప్రభుత్వ వినాశకర విధానాలను తిప్పికొట్టాలి

సిఐటియు



సమావేశంలో మాట్లాడుతున్న రాజ్‌కుమార్ తదితరులు

ప్రజాశక్తి -మధురవాడ : కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న వినాశకర విధానాలను తిప్పి కొట్టాలని సిఐటియు మధురవాడ జోన్ కమిటీ పిలుపునిచ్చింది. కొమ్మాది సిఐటియు కార్యాలయంలో మంగళవారం ఏర్పాటుచేసిన సమావేశంలో జోన్ కార్యదర్శి పి.రాజ్‌కుమార్ మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా ఈ నెల 16వ తేదీన కార్మికులు, శ్రామికులు భారీ సమ్మెతో పాటు, గ్రామీణ ప్రాంతాల బందుకు పిలుపునిచ్చినట్లు తెలిపారు. కార్మికులు, కర్షకులతో జరిగే ఈ సమ్మె దేశ భక్తి యుతమైనదన్నారు. ఈ సమ్మెలో భాగంగా ఆటో, ఇతర రవాణా కార్మికులు తమ సమస్యలపై ఈ పోరాటంలో భాగస్వాములు కావాలని కోరారు. రవాణా రంగంపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్రమైన దాడి చేస్తున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. హిట్ అండ్ డ్రైవ్ పేరుతో ప్రమాదాల సమయంలో అక్కడి నుంచి ఆత్మరక్షణ కోసం తప్పించుకుంటే అదనంగా పదేళ్ళ శిక్ష విధించేలా క్రిమినల్ కోడ్‌లో మార్పు చేశారని తెలిపారు. జరిమానాలు కూడా పెంచారన్నారు. రవాణా కార్మికులకు కనీస సంక్షేమ పథకాలు అమలు చేయకుండా అన్యాయం చేస్తుందన్నారు. అన్ని విధాలా రవాణా కార్మికులను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఆటో యూనియన్ నాయకులు టి.రమేష్‌బాబు, జి.చిన్నారావు, రాము పాల్గొన్నారు.

ఆసరా చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి - యంత్రాంగం

ఆనందపురం: మహిళతో అభివృద్ధి సాధ్యమని భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని తర్లువాడలో సర్పంచ్ బిఆర్‌బి నాయుడు ఆధ్వర్యాన మంగళవారం వైఎస్ఆర్ ఆసరా నాలుగో విడత చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, వైఎస్ఆర్ ఆసరాతో మహిళా సాధికారిత మెరుగుపడిందన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో స్వయం సహాయక సంఘాల సభ్యుల ఆర్థిక పురోగతికి ఎంతగానో దోహదపడిందన్నారు. నాలుగో విడత ఆసరా ఆనందపురం మండలంలో 1293 సంఘాల్లోని 13701 అక్క చెల్లెమ్మలకు రూ.10.45 కోట్లు పొదుపు సంఘాల ఖాతాలో జమ చేశామని తెలిపారు. అనంతరం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ శోభారాణి, ఎంపిడిఒ అడపా లవరాజు, తహశీల్దార్ లోకవరపు రామారావు, మండల వైసిపి ప్రెసిడెంట్ బంక సత్యం, వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకట్రావు, జడ్‌పిటిసి కోరాడ వెంకట్రావు, వైస్ ఎంపిపిలు పాండ్రంకి శ్రీను, బొట్ట ధనలక్ష్మి, రామకృష్ణ, జిశ్రీను, ఎఎంసి వైస్ చైర్మన్ అప్పలనాయుడు, మణి శంకర్ నాయుడు ,రౌతు వెంకట్రావు, శ్యామల, రౌతు శ్రీను, డ్వాక్రా ఎపిఎం నాగభూషణ్, రంగారావు పాల్గొన్నారు.


మహిళలకు చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

సింహాచలం: సింహాచలం వేతనగిరిపాలెం గ్రౌండ్‌లో వైఎస్ఆర్ ఆసరా చెక్కులను మహిళలకు ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అందించారు. అనంతరం జగన్మోహన్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో కోలుసు ఈశ్వరరావు, కర్రి అప్పలస్వామి, ఎర్రవరం బాబు తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ మెరిట్ విద్యార్థులకు ప్రోత్సాహకం

ప్రజాశక్తి -పద్మనాభం : పద్మనాభం జిల్లా పరిషత్ హై స్కూల్‌లో చదివి 2022 -23 సంవత్సరం పదోతరగతి ఫలితాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు భీమిలి అసెంబ్లీ నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేయనున్న నాగోతి నాగమణి ప్రోత్సాహకం అందించారు. ప్రథమ స్థానంలో నిలిచిన బొగత హేమలతకు రూ.3 వేలు, రెండో స్థానంలో నిలిచిన రామినేని అంజలికి రూ.2 వేలు నగదును పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాలమణి సమక్షంలో అందించారు. ఈ సందర్భంగా నాగమణి మాట్లాడుతూ, విద్యార్థులు బాగా చదువుకున్నప్పుడే జీవితాలు బాగుంటాయన్నారు.

ఆనందపురం : 2023లో ఆనందపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి 10వ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు నాగోతు నాగమణి ప్రోత్సాహకంగా నగదు బహుమతి అందించారు. వేములవలసకు చెందిన లంక మధుప్రియ, బంక ప్రవీణ్‌కు రూ.3 వేలు, రూ.2 వేలు చొప్పున అందించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బి.శ్రీనివాసరావు, కెజియా, పాల్గొన్నారు.

గీతం ఎడుయూత్ మీట్‌లో 'యువ ప్రభంజనం'



ఎడుయూత్‌మీట్‌కు హాజరైన విద్యార్థులు (ఇన్‌సెట్‌లో మాట్లాడుతున్న రవిశంకర్)

ప్రజాశక్తి-విశాఖపట్నం : నవ సమాజంలో మానవత విలువలను పెంచడానికి "కలిసి నడుద్దాం, కలిసి ఎదుగుదాం, ముందుకు సాగుదాం" అనే నినాదంతో పాటు మత్తు మందుల వినియోగానికి వ్యతిరేకంగా యువత ప్రతిజ్ఞ చేయాలని పిలుపునిస్తూ గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం వేదికగా ఆర్ట్ ఆఫ్ లివింగ్ మంగళవారం నిర్వహించిన ఎడుయూత్ మీట్‌కు యువత పోటెత్తింది. నగరంలోని వివిధ కళాశాలల నుంచి, సమీప జిల్లాల నుంచి 50 వేల మందికిపైగా యువత ముందస్తుగా పేర్లను నమోదు చేసుకొని హాజరయ్యారు. ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకులు గురుదేవ్ రవిశంకర్ యువతను ఉద్దేశించి ప్రసంగిస్తూ ప్రపంచంలో నేటి యువత తీవ్ర మానసిక ఒత్తిడలకు లోనవుతోందని, వాటి నుంచి బయట పడడానికి కొందరు మత్తు పదార్థాలకు బానిసలుగా మారుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. యోగా, ధ్యానం మార్గాల ద్వారా అంతర్గత శక్తులను మేలుకొల్పడంతో పాటు ఒత్తిడులను దూరం చేసుకోవచ్చని తెలిపారు. ప్రజల మధ్య ఆత్మీయ భావం పెరగాలన్నారు. ఈ సందర్భంగా డ్రగ్స్ వాడకాన్ని వ్యతిరేకిస్తూ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో గీతం అధ్యక్షుడు ఎమ్.శ్రీభరత్, వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ దయానంద సిద్దవట్టం, నారాయణ విద్యా సంస్థల ఛైర్మన్ సింధూర, జిమ్‌సర్ ప్రో-వైస్ ఛాన్సలర్ డాక్టర్ బి.గీతాంజలి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే అదీప్‌రాజు అడ్డగింత

గోబ్యాక్ అంటూ మురుబాయ్ గ్రామస్తుల నినాదాలు

ప్రజాశక్తి- గాజువాక : జివిఎంసి 77వ వార్డు పరిధి మురుబాయ్ గ్రామంలో ఎమ్మెల్యే నిధులతో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ఏర్పాటుచేసిన శంకుస్థాపన కార్యక్రమానికి వచ్చిన పెందుర్తి ఎమ్మెల్యే అదీప్ రాజును స్థానికులు మంగళవారం అడ్డుకున్నారు. ఎమ్మెల్యేగా ఐదేళ్లు పూర్తవుతున్నా ఇంతవరకు తమ గ్రామం వైపు చూడని మీరు ఇప్పుడు కూడా రావొద్దంటూ రోడ్డుపైనే గ్రామస్తులు అడ్డుకున్నారు. గో బ్యాక్ ఎమ్మెల్యే అంటూ నినాదాలు చేశారు. ఎమ్మెల్యే గన్‌మ్యాన్ కారు దిగివచ్చి నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. గ్రామస్తులు వినలేదు. కూర్మన్నపాలెం పోలీసులు వచ్చి ఎమ్మెల్యే కారును అడ్డుకోవద్దని చెప్పారు. అయినా వారు వినకపోగా రోడ్డుకడ్డంగా కారుకు ఎదురుగా కూర్చుని బైటాయించారు. ప్రతి నెలా తమ గ్రామాన్ని సందర్శిస్తామని చెప్పిన ఎమ్మెల్యే ఇంతవరకు కనిపించకుండా, ఇప్పుడు ఏం మొహం పెట్టుకుని వచ్చారని ప్రశ్నించారు. ఘర్షణ పెరగడంతో చేసేదిలేక ఎమ్మెల్యే వెనుదిరిగారు.



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

ఆలోచనలు సృజనాత్మకంగా ఉండాలి

ప్రజాశక్తి- భీమునిపట్నం : మన ఆలోచనలు ఎల్లప్పుడూ సృజనాత్మకంగా ఉండాలని జిల్లా సమగ్ర శిక్ష ఎపిసి పి శ్రీనివాసరావు విద్యార్థినులకు సూచించారు. స్థానిక కెజిబివిలో మంగళవారం టెన్త్, ఇంటర్ విద్యార్థినులు ఫేర్‌వెల్ డే నిర్వహించారు. ముఖ్య అతిథిగా శ్రీనివాసరావు హాజరై మాట్లాడారు. తల్లిదండ్రుల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా చదువుకొని ఉన్నతంగా ఎదగాలని కోరారు. పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరచాలని సూచించారు. జిసిడిఒ కాలే షా బేగం మాట్లాడుతూ, ఇష్టపడి చదవాలని కోరారు. ప్రిన్సిపల్ గంగాకుమారి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు, అధ్యాపకులు పాల్గొన్నారు. ఫేర్‌వెల్ డేలో భాగంగా విద్యార్థినులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.



వర్క్‌షాపును ప్రారంభిస్తున్న ధర్మకర్త కృష్ణకుమార్, రాధాకృష్ణన్

శంకర్ ఫౌండేషన్‌లో వర్క్ షాప్

ప్రజాశక్తి-వేపగుంట : నాయుడుతోటలోని శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యాన కంటి సంరక్షణ నిర్వహణలో సరికొత్త ఆవిష్కరణలు, సాంకేతిక పురోగతిని పంచుకునే లక్ష్యంతో ఆప్తాల్మాలజీలో క్లినికల్ అప్ డేట్స్‌పై ఒక రోజు వర్క్ షాప్ నిర్వహించారు. ఉత్తరాంధ్రలోని ఆరు జిల్లాల నుంచి జిల్లా ప్రోగ్రామ్స్ మేనేజర్, పారామెడికల్ ఆప్తాల్మిక్ ఆఫీసర్లు, కంటివెలుగు పారా మెడియల్ ఆప్తాల్మిక్ అసిస్టెంట్లు వర్క్ షాప్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిఎం కె.రాధాకృష్ణన్ మాట్లాడుతూ, ఒపిడి క్లినికల్ సేవల రంగాల్లో శంకర్ ఫౌండేషన్ శరవేగంగా అభివృద్ధి చెందిందని, సమాజంలో నివారించదగిన అంధత్వాన్ని నిర్మూలించడంలో కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు.

డాక్టర్ కృష్ణప్రసాద్, డాక్టర్ టి.రవీంద్ర, డాక్టర్ శిరీష, డాక్టర్ కృష్ణ, డాక్టర్ సుపర్ణ, డాక్టర్ సౌమ్య తమ ప్రజెంటేషన్లలో సౌకర్యాలు, క్లినికల్ పురోగతి, ఆధునిక పరిణామాలను అర్థం చేసుకోవడం, ఆప్తాల్మాలజీ రంగంలో విప్లవాత్మక మార్పులను వివరించారు. ఈ సందర్భంగా ప్రాంతీయ కంటి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి.మీనాక్షిని సన్మానించారు. అనకాపల్లి జిల్లా డిపిఎం డాక్టర్ జీవీ రమణకుమార్, పార్వతీపురం డిపిఎం డాక్టర్ కె.సుకుమార్బాబు, ఎఎస్ఆర్ జిల్లా డిపిఎం డాక్టర్ టి.విశ్వేశ్వరరావునాయుడును సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ కృష్ణకుమార్ ఆత్మకూరి, విజయకుమార్ ఆత్మకూరి, ఎజిఎం (ఆపరేషన్స్) కేవీ వేణుగోపాల్, సీనియర్ మేనేజర్ (ఔట్ రీచ్) ఎన్ఎ.అప్పలరాజు, డిజిఎంలు వి.రమేష్‌కుమార్, కె.బంగార్రాజు పాల్గొన్నారు.

నేడు బంగారినాయుడు ఉద్యోగ విరమణ



బంగారినాయుడు దంపతులు

ప్రజాశక్తి -గాజువాక : విశాఖ స్టీల్‌ప్లాంట్ ఎస్ఎంఎస్ విభాగంలో జనరల్ ఫోర్‌మెన్‌గా పనిచేస్తున్న లచ్చుపతుల బంగారినాయుడు బుధవారం ఉద్యోగ విరమణ చేయనున్నారు. విజయనగరం జిల్లా, బాడంగి మండలం భీమవరంలో బంగారినాయుడు జన్మించారు. 1979- 80లో బాడంగి జిల్లా పరిషత్ హైస్కూల్ నుంచి 10వ తరగతి ఉత్తీర్ణులయ్యారు. 1980- 82లో బొబ్బిలిలోని ఆర్ఎస్ఆర్‌కె కాలేజీలో ఇంటర్మీడియట్ పూర్తిచేశారు. 1983-85లో పార్వతీపురంలో ఎస్ఎస్‌జిఎంలో ఐటిఐ ఫిట్టర్ చేశారు. 1989 మార్చి 13న విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో జూనియర్ ట్రైనీగా చేరారు. నాలుగు నెలలు ట్రైనింగ్ పూర్తి చేసుకున్న తర్వాత కోకో ఒవెన్ కన్‌స్ట్రక్షన్‌లో విధుల్లో ప్రారంభించారు. 1990లో ఎస్ఎంఎస్ కన్వర్ట్-1 మెకానిక్ విభాగంలో విధులు చేపట్టారు.

1989లో సిఐటియు, 1990లో సిపిఎం సభ్యత్వం తీసుకున్నారు. స్టీల్‌ప్లాంట్ ఎస్ఎంఎస్ డిపార్ట్‌మెంట్ అధ్యక్షులుగా, సిఐటియు ఉపాధ్యక్షులుగా పనిచేశారు. సిపిఎం స్టీల్ డివిజన్ మెంబర్‌గా పనిచేశారు. 1995లో స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ లేబర్ యూనియన్‌లో నాలుగేళ్లు సేవలందించారు. పివి.నరసింహారావు కొండలపై పేదల ఇళ్లను తొలగించినప్పుడు దానికి వ్యతిరేకంగా పోరాటం చేశారు. భూ పోరాటంలోనూ పాల్గొన్నారు. ఇంటి పన్నుల పెంపునకు వ్యతిరేకంగా, చెత్త పన్ను, గాజువాక హౌస్ కమిటీ సమస్యపై పోరాడారు. నివాసముంటున్న శివాజీనగర్ ఏరియాలో హౌస్ ఓనర్ అసోసియేషన్ అధ్యక్షులుగా కొనసాగుతున్నారు. కణితి రోడ్డులో డివైఎఫ్ఐ గ్రంథాలయం ఏర్పాటుకు కృషిచేశారు. భవిష్యత్తులో పార్టీ కార్యక్రమంలో పాల్గొంటానని ఈ సందర్భంగా ఆయన చెప్పారు.

'టిడిపితో బీసీలకు సముచిత స్థానం'



జయహో బిసి సదస్సులో మాట్లాడుతున్న ఎం.శ్రీభరత్

ప్రజాశక్తి -మధురవాడ : టిడిపి ప్రభుత్వం హయంలో బీసీలకు అన్ని రంగాలలోనూ మంచి గుర్తింపు ఇచ్చి సుముచిత స్థానం కల్పించారని విశాఖ పార్లమెంట్ టిడిపి ఇన్‌ఛార్జి ఎం.శ్రీభరత్ అన్నారు. జివిఎంసి 5వ వార్డు పరిధి మధురవాడ బోట్టవానిపాలెం టిడిపి కార్యాలయంలో మంగళవారం 5, 6, 7, 8, 98 వార్డులకు సంబంధించి టిడిపి భీమిలి అసెంబ్లీ ఇన్చార్జ్ కోరాడ రాజబాబు, 5వ వార్డు కార్పొరేటర్ మొల్లి హేమలత ఆధ్వర్యాన జయహో బీసీ సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శ్రీభరత్ హాజరై మాట్లాడారు. వైసిపి ప్రభుత్వం బీసీలను అన్ని విధాల అణగతొక్కుతోందన్నారు. వైసిపి ప్రభుత్వం 56కార్పొరేషన్లు ఏర్పాటుచేసి వారిని ఉత్సవ విగ్రహాలుగా మార్చారని విమర్శించారు. నాలుగున్నరేళ్లుగా బీసీలకు ఎటువంటి వ్యక్తిగత రుణాలు, పథకాలు అమలు చేయలేదన్నారు. ఉత్తరాంధ్ర నుంచి బీసీ నాయకులు కింజరాపు ఎర్రన్నాయుడును కేంద్రమంత్రి, దళిత మహిళ ప్రతిభా భారతిని స్పీకర్ చేసిన ఘనత టిడిపికి దక్కుతుందన్నారు. పార్టీ అధికారంలోకి రావడానికి ప్రతి కార్యకర్తా సైనికుడిలా పనిచేయాలని పిలుపునిచ్చారు. అనంతం5, 6, 7వార్డులలో బైక్ ర్యాలీ నిర్వహించారు. వుడారోడ్డులోని గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. టిడిపి జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు మొల్లి హేమలత, పిల్లా మంగమ్మ, నాయకులు మొల్లి లక్ష్మణరావు, పిల్లా వెంకట్రావు, గొలగాని సన్యాసిరావు, తమ్మిన విజయకుమార్, మధు, వాండ్రాసి అప్పలరాజు, నమ్మి శ్రీనివాసరావు, పాసి నర్సింగరావు, నాగోతి వెంకట సత్యనారాయణ, దాసరి శ్రీనివాస్, పిల్ల నర్సింగరావు, పంచదార్ల శ్రీనివాస్, గంట నూకరాజు, ఈగల రవి కుమార్, కానూరు అచ్యుతరావు, ఓమ్మి బాబూరావు, పాసి త్రినాథ్, అంగటి రాము, నాగోతి సూర్యప్రకాష్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బాక్సింగ్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-సీతమ్మధార : విశాఖపట్నం బాక్సింగ్ అసోసియేషన్ సెక్రటరీ జనరల్ వాసుపల్లి అమ్మోరు ఆధ్వర్యాన ఉత్తరాంధ్ర బాక్సింగ్ ఛాంపియన్‌షిప్- 2024 పోటీలను వికె పిసిపిఐఆర్ యుడిఎ చైర్మన్ చొక్కాకుల వెంకటరావు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా చొక్కాకుల వెంకటరావు మాట్లాడుతూ, క్రీడలు మానసిక, శారీరక సమతుల్యతను పెంపొందించేందుకు దోహదపడతాయన్నారు. బాక్సింగ్ క్రీడ ద్వారా విశాఖపట్నంలో ఎంతోమంది జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించారని, ఉద్యోగాలు సంపాదించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోర్ట్ ట్రస్ట్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు గొర్లె చందు, జాతీయస్థాయి బాక్సర్లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

జిఒ 296 పట్టాలను రిజిస్ట్రేషన్ చేయాలి

ప్రజాశక్తి-పెందుర్తి : గత ప్రభుత్వం జిఒ 296 ద్వారా ఇచ్చిన పట్టాలకు రిజిస్ట్రేషన్ చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.జగన్, పెందుర్తి జోన్ కార్యదర్శి బి.రమణి డిమాండ్‌చేశారు. 100 గజాలలోపు ఉండి 2009 సంవత్సరం నుంచి నివాసముండే పేదల స్థలాలకు గత ప్రభుత్వం పట్టాలు మంజూరుచేసిందని తెలిపారు. రెండేళ్ల తరువాత రిజిస్ట్రేషన్ చేస్తామని అందులో పేర్కొన్నా, టిడిపి ప్రభుత్వం ఆ పనిని పూర్తి చేయలేదని వివరించారు. తరువాత వచ్చిన వైసిపి కూడా దాని గురించి పట్టించుకోలేదని తెలిపారు. చట్టాలు అందరికీ సమానమని చెబుతున్న పాలకులు 95 వార్డు వైసిపి కార్పొరేటర్ దేవుడుకు సుమారు 500 గజాలను రిజిస్ట్రేషన్ చేశారని, పేదలకు మాత్రం 60 గజాల స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయకుండా ఆపుతున్నారని పేర్కొన్నారు. పట్టాలు రిజిస్ట్రేషన్ చేయక పెందురిలో చాలామంది ఇబ్బంది పడుతున్నారని, కనీసం ఆ పట్టా మీద బ్యాంకులో అప్పు తీసుకోవడం కూడా సాధ్యం కావట్లేదని ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి వెంటనే రిజిస్ట్రేషన్ ప్రారంభించాలని, లేకుంటే ప్రజల్ని సమీకరించి పోరాటానికి సిద్ధం చేస్తామని హెచ్చరించారు.

టిడిపి - జనసేనను ఏ శక్తీ అడ్డుకోలేదు

ప్రజాశక్తి -గాజువాక : వచ్చే ఎన్నికల్లో టిడిపి- జనసేనను ఏ శక్తీ అడ్డుకోలేదని టిడిపి పార్లమెంటరీ పార్టీ అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు. పార్టీ కార్యాలయంలో బూత్, క్లస్టర్, యూనిట్ ఇన్‌ఛార్జిలకు మంగళవారం ఇంటిగ్రేటెడ్ శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా తెలుగుదేశం -జనసేన ప్రభంజనంలో జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం కొట్టుకుపోవటానికి సిద్ధంగా ఉండాలన్నారు. ఓటమి భయంతో ప్రతిపక్ష పార్టీలపైనా, చివరికి చెల్లిపైనా రాజకీయ దిగజారుడు విమర్శలను జగన్మోహన్‌రెడ్డి చేస్తున్నారని ఆరోపించారు. జగన్మోహన్‌రెడ్డి ఎన్ని కుట్రలు చేసినా 2024 వైసిపికి అంతిమ ఎన్నికలన్నారు. ఈ కార్యక్రమంలో నియోజవర్గ పార్టీ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్, కార్పొరేటర్లు బోండా జగన్, పల్లా శ్రీనివాసరావు, జివిఎంసి డిప్యూటీ ఫ్లోర్ లీడర్ గంధం శ్రీనివాసరావు, 75వ వార్డు ఇన్‌ఛార్జి నల్లూరి సూర్యనారాయణ, ఎస్.అనంతలక్ష్మి పాల్గొన్నారు.

జిల్లాలో పరిశ్రమల అభివృద్ధికి కృషి

కలెక్టర్ రవి పట్టన్ శెట్టి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

ప్రజాశక్తి-అనకాపల్లి

జిల్లాలో పరిశ్రమల అభివృద్ధికి సంబంధిత శాఖల అధికారులందరూ సమన్వయంతో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రవి పట్టన్ శెట్టి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా పరిశ్రమల అభివృద్ధి కమిటీ సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యుత్ సరఫరా అంతరాయం లేకుండా చూడాలని, నిర్మాణాలు ప్రణాళికాబద్ధంగా జరిగేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పరిశ్రమల స్థాపన, అభివృద్ధి విషయంలో సలహాలు సూచనలు ఎప్పటికప్పుడు అందిస్తూ ఉండాలన్నారు. పరిశ్రమలన్నీ భద్రతా ప్రమాణాలు తప్పక పాటించే విధంగా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. పారిశ్రామిక ప్రాంతంలో హమాలీల చార్జీలను పెంచే విషయంలో త్వరగా నిర్ణయాలు చేపట్టాలని ఆదేశించారు. పీఎం విశ్వకర్మ యోజన కార్యక్రమంలో చేతివృత్తుల వారిని గుర్తించి రిజిస్టర్ చేయించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి బి. దయానిధి, ఆర్డిఓ ఏ.చిన్నికృష్ణ, జిల్లా పరిశ్రమల కేంద్రం జిఎం శ్రీధర్, ఏపీఐఐసీ జెడ్ ఎం త్రినాథ్, డిపిఓ ఆర్. శిరీష రాణి, డిఆర్‌డిఏ పిడి శచీదేవి, లీడ్ బ్యాంకు మేనేజర్ సత్యనారాయణ, పారిశ్రామికవేత్తలు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

జంతు పరిరక్షణపై అవగాహన

ప్రజాశక్తి- కశింకోట : జంతు సంక్షేమ సామాజిక బాధ్యత పక్షోత్సవాల్లో భాగంగా మంగళవారం మండలంలోని నరసింగపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు జంతువుల పరిరక్షణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కోన అరుణ నాగేశ్వరరావు మాట్లాడుతూ జంతు సంపద మానవ మనుగడకు అవసరమన్నారు. విద్యార్థి దశ నుంచి జంతువులపై ప్రేమ పెంచుకొని, వాటిని వృద్ధి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పోటీలను నిర్వహించి విజేతలకు సర్పంచ్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నరసింగపల్లి పశు వైద్యాధికారి డాక్టర్ చైతన్య మణి, సహాయకులు అశ్విని, రూపవతి పాల్గొన్నారు.

ఎంవిఆర్‌ను కలిసిన కాంగ్రెస్ నాయకులు

ప్రజాశక్తి-అనకాపల్లి : ప్రముఖ వ్యాపారవేత్త ముత్యాల వెంకటేశ్వరరావు (ఎంవిఆర్)ను కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కొయ్య ప్రసాద్, ఇతర నాయకులు మంగళవారం ఎంవిఆర్ నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రస్తుత రాజకీయాలపై ఇరువురు చర్చించారు. ఈ సందర్భంగా కొయ్య ప్రసాద్ మాట్లాడుతూ రాజకీయాలతో సంబంధం లేకుండా చేస్తున్న సేవా కార్యక్రమాలతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారని ఎంవిఆర్‌ను కొనియాడారు. కాంగ్రెస్ పార్టీ లోకి వస్తే పార్టీ తగిన గుర్తింపునిస్తుందని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంవిఆర్ అభిమానులు పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం కార్యవర్గ ప్రమాణ స్వీకారం


ప్రజాశక్తి-అనకాపల్లి : ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేశన శంకర్‌రావు ఆధ్వర్యాన జిల్లా బీసీ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం మంగళవారం స్థానిక రింగ్ రోడ్డు సన్ కాస్ట్లీ హెూటల్లో ప్రమాణస్వీకారం చేసింది. ముఖ్య అతిథిగా టిడిపి బీసీ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ మల్ల సురేంద్ర పాల్గొని నూతన కార్యవర్గ సభ్యులను సత్కరించి, నియామక పత్రాలను అందజేశారు. సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులుగా బుద్ధ భూలోక నాయుడు, అధ్యక్షులుగా కొణతాల చంద్రరావు, ఉపాధ్యక్షులుగా పిట్ల రాజు, ప్రధాన కార్యదర్శిగా కే రాజు, కోశాధికారిగా శివ, మహిళా కోఆర్డినేటర్‌గా బుద్ధ చంద్ర, సభ్యులుగా మల్ల ప్రసాద్, ఆకుల నానాజీ, కర్రీ సుబ్రహ్మణ్యం, దాడి బుజ్జి, కర్రీ మహాలక్ష్మి నాయుడు తదితరులు ప్రమాణ స్వీకరణ చేశారు.

ఎన్నికల నిర్వహణపై పోలీసులకు శిక్షణ

ప్రజాశక్తి-అనకాపల్లి : రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోలీసు సిబ్బందికి స్థానిక పెంటకోట కన్వెన్షన్ హాల్లో మంగళవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎస్పి మురళీకృష్ణ హాజరై ఎన్నికల విధివిధానాలు, నియమ నిబంధనలు, సంబంధిత చట్టాలు అంశాలపై పలు సూచనలు చేశారు. ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించుటకు ప్రణాళికా బద్దంగా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం ఎపి పోలీస్ ఆఫీసర్స్ అసోసియేషన్ ప్రింట్ చేసిన పోలీస్ డైరీ 2024 జిల్లా ఎస్పీ ఆవిష్కరించి అధికారులకు అందజేశారు. ఈ శిక్షణ కార్యక్రమంలో నర్సీపట్నం సబ్ డివిజన్ ఆఫీసర్ అది రాజ్ సింగ్ రాణా, అదనపు ఎస్పీలు బి.విజయ భాస్కర్, పి.సత్యనారాయణ రావు, డీఎస్పీలు వి.సుబ్బరాజు, కె.వి.సత్యనారాయణ, ఎలక్షన్ సెల్ ఇన్స్పెక్టర్ అప్పల నాయుడు, ఇనస్పెక్టర్లు లక్ష్మణ మూర్తి, చంద్ర శేఖర్, జిల్లాలోని ఇతర సీఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా బొడ్డేడ ప్రసాద్ జన్మదిన వేడుకలు


ప్రజాశక్తి- మునగపాక : వైసిపి అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ 50వ జన్మదిన వేడుకలు మండలంలోని పలు గ్రామాలలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ప్రసాద్ కాంప్ ఆఫీస్‌కి ఉదయం నుండి అభిమానులు పోటెత్తారు. ఆయన్ను కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. స్థానిక మెయిన్ రోడ్‌లో అభిమానులు రక్తదాన శిబిరం నిర్వహించారు. పలు గ్రామాలలో పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు.



బొడ్డేడ ప్రసాద్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న పార్టీ నాయకులు


సర్పంచ్‌ల నిరసన దీక్ష

ప్రజాశక్తి-అనకాపల్లి : మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా అనకాపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షులు చింతకాయల సూజాత ముత్యాలు ఆధ్వర్యాన మంగళవారం సర్పంచ్‌ల నిరసన దీక్ష చేపట్టారు. ఇందులో ముఖ్యఅతిథిగా పాల్గొన్న సంఘం రాష్ట్ర అధ్యక్షులు వానపల్లి లక్ష్మి ముత్యాలరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సర్పంచ్‌ల 16 డిమాండ్‌లను తక్షణమే పరిష్కరించాలన్నారు. గ్రామ స్వరాజ్యమే లక్ష్యంగా 73, 74 రాజ్యాంగ సవరణలోని ఆర్టికల్ 243జి, 11వ షెడ్యూల్లో పేర్కొన్న 29 అంశాలలోని నిధులు, విధులు, అధికారాలను సర్పంచ్‌లకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీకి రావలసిన రూ.8629 కోట్లును రాష్ట్ర ప్రభుత్వం దారిమళ్లించిందని, ఆ నిధులు పంచాయతీ ఖాతాలోకి జమ చేయాలని కోరారు. స్థానిక సంస్థలకు నిధులు ఇవ్వకపోతే వచ్చే ఎన్నికలలో వైసీపీ ప్రభుత్వానికి తమ తడఖా చూపిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి విశాఖపట్నం జిల్లాల సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, ఎంపిటీసిలు, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.



మోకాళ్లపై నిరసన తెలుపుతున్న సర్పంచ్‌లు

సమాన హక్కులు కల్పించిన మహనీయుడు అంబేద్కర్



అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ధర్మశ్రీ

ప్రజాశక్తి-చోడవరం : రాజ్యాంగ రూపకల్పనతో ప్రజలందరికీ సమన్వ హక్కుల కల్పించిన ఆదర్శనీయుడు డాక్టర్ బిఆర్.అంబేద్కర్ అని చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ అన్నారు. మండలంలోని తిమ్మలపాలెం గ్రామంలో అంబేద్కర్ విగ్రహాన్ని మంగళవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయాల సాధనకు అందరూ కృషి చేయాలన్నారు. అనంతరం లక్ష్మీపురంలో విలేజ్ హెల్త్ సెంటర్, రైతు భరోసా కేంద్రం, కండుపల్లి గ్రామంలో కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గాడి కాసు, మార్కెట్ కమిటీ చైర్మన్ ఏడవక సత్యారావు, వైకాపా మండల అధ్యక్షుడు దొడ్డి వెంకటరావు, అంబేద్కర్ యూత్ సభ్యులు చంద్రరావు, లక్ష్మీపురం పిఎసిఎస్ అధ్యక్షులు సేనాపతి సత్యారావు, సర్పంచ్ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అధికారులకు ఘన వీడ్కోలు

ప్రజాశక్తి - పరవాడ

తూర్పు గోదావరి జిల్లాకు బదిలీ అయిన మండల అభివృద్ధి అధికారి హేమసుందరరావు, ఉద్యోగోన్నతిపై పశ్చిమ గోదావరి జిల్లాకు ఎంపిడిఒగా వెళ్తున్న ఇఒపిఆర్‌డి పద్మజకు ఎంపిడిఒ కార్యాలయంలో మంగళవారం మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది వీడ్కోలు సభ నిర్వహించారు. సభకు ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎంపీపీ పైల వెంకట పద్మ లక్ష్మీ శ్రీనివాసరావు, జెడ్పీటీసీ పైల సన్యాసిరాజు ఎంపిడిఒ, ఇఒపిఆర్‌డిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బూస అప్పలరాజు, వైసిపి మండల అధ్యక్షులు కోన రామారావు, పలువురు సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, సిబ్బంది పాల్గొన్నారు.



ఎంపిడిఒ, ఇఒపిఆర్‌డి వీడ్కోల్ సభలో పాల్గొన్న సిబ్బంది

3న ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి - కశింకోట

కశింకోట విశ్రాంత ఉద్యోగుల సంఘం భవనం ఫిబ్రవరి 3వ తేదీన ఉదయం 10 గంటలకు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు విశ్రాంత ఉద్యోగులు పాము సూర్య నారాయణ, నంబా రమణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. శంకర్ ఫౌండేషన్ నేత్రాలయం వైద్యులు ఉచితంగా కంటి పరీక్షలు చేస్తారని, శస్త్రచికిత్స అవసరమైనవారికి ఉచితం చేస్తారని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

టెక్నికల్ కోర్సులకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-అనకాపల్లి : డ్రాయింగ్, హ్యాండ్లూమ్, వీవింగ్, టైలరింగ్ అండ్ ఎంబ్రాయిడరీ టెక్నికల్ కోర్సులకు ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు జిల్లా పాఠశాల విద్యాధికారిణి ఎం వెంకటలక్ష్మమ్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. డైరెక్టర్, ప్రభుత్వ పరీక్షల విభాగం, విజయవాడ, ఆంధ్రప్రదేశ్ 2024 ఏప్రిల్ ప్రభుత్వం గుర్తించిన కేంద్రాల్లో టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. డ్రాయింగ్, లోయర్ గ్రేడ్‌కు రూ.100, హయ్యర్ గ్రేడ్‌కు రూ.150, హ్యాండ్లూమ్ వీవింగ్, టైలరింగ్ అండ్ ఎంబ్రాయిడరీ లోయర్ గ్రేడ్‌కు రూ.150, హయ్యర్ గ్రేడ్‌కు రూ.200 చొప్పున అపరాధ రుసుము లేకుండా ఫిబ్రవరి 20, రూ.50 అపరాధ రుసుముతో ఫిబ్రవరి 29, రూ.75 అపరాధ రుసుముతో మార్చి ఆరో తేదీలోగా పరీక్ష ఫీజు చెల్లించాలని సూచించారు. వివరాలకు www.bse.ap.gov.in వెబ్ సైట్ పరిశీలించాలన్నారు.

నేడు రీజనల్ జాబ్ మేళా

ప్రజాశక్తి-అనకాపల్లి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో విజయనగం జిల్లా గాజులరేగ వద్ద గల సీతమ్ కళాశాలలో ఈ నెల 31న సుమారు 80 కంపెనీలతో రీజినల్ జాబ్ మేళా నిర్వహిస్తునట్టు సంస్థ జిల్లా అధికారి టి. చాముండేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఇంటర్వ్యూలకు పదవ తరగతి నుండి పిజి వరకు చదువుకొని 18 నుండి 30 సంవత్సరముల లోపు వయస్సు గల యువతీ, యువకులు పాల్గొనవచ్చని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9014765287, 7036363272 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు క్రీడాకారుల ఎంపిక

ప్రజాశక్తి -అచ్యుతాపురం : రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు 24 మంది క్రీడాకారులతో కూడిన అనకాపల్లి జిల్లా సబ్ జూనియర్ జట్టును అచ్చుతాపురం పోలీస్ గ్రౌండ్స్‌లో మంగళవారం నిర్వాహకులు కె.వెంకు నాయుడు ఆధ్వర్యంలో ఎంపిక చేశారు. ఎంపిక చేసిన క్రీడాకారులు ఫిబ్రవరి 3, 4 తేదీల్లో భీమిలి సన్ స్కూల్లో జరిగే పోటీలలో ఆడతారని ఆయన తెలిపారు. శ్రీ విష్ణ డెంటల్ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ అడిగర్ల సుధీర్ మాట్లాడుతూ చదువుతోపాటు క్రీడాలలోనూ విద్యార్థులు శ్రద్ధ చూపించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇసాన్ చిల్డ్రన్స్ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ డి వెంకట్, మెడిరైస్ హాస్పటల్ వైద్యులు డాక్టర్ జగదీష్, వైసీపీ సీనియర్ నాయకుడు కోన బుజ్జి, కైట్స్ విద్యా విహారి స్కూల్ కరస్పాండెంట్ రెడ్డి గణేష్, రగ్బీ జిల్లా కోచ్ వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

ప్రజాశక్తి -మునగపాక : కులాలకు, మతాలకు, పార్టీలకు అతీతంగా అర్హులందరికీ వైసిపి ప్రభుత్వం సంక్షేమ ఫలాలు అందిస్తుందని యలమంచిలి ఎమ్మెల్యే యువి.రమణమూర్తిరాజు అన్నారు. స్థానిక రాహుల్ గాంధీ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం జరిగిన వైయస్సార్ ఆసరా మండల సదస్సులో ఆయన మాట్లాడారు. అనంతరం మండలంలోని గంగాదేవి పేటలోని నూతనంగా నిర్మించిన అంగనవాడి కేంద్రాన్ని, మునగపాకలో సీసీ రోడ్లను ప్రారంభించారు. కార్యక్రమంలో డిసిసిబి మాజీ చైర్మన్ యు.సుకుమార్ వర్మ, ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, జడ్పిటిసి పెంటకోట స్వామి సత్యనారాయణ, వైసిపి నాయకులు ఆడారి గణపతి అచ్చం నాయుడు, పొలిమేర గణేష్ పాల్గొన్నారు.

సుప్రీం తీర్పు జగన్ ప్రభుత్వానికి చెంపపెట్టు

ప్రజాశక్తి -అనకాపల్లి, వడ్డాది : టిడిపి అధినేత చంద్రబాబుపై పెట్టిన ఇన్నర్ రింగ్ రోడ్డు కేసుల్లో ఆయనకు ముందస్తు బెయిల్ రద్దు చేయాలని ప్రభుత్వం వేసిన పిటీషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేడయం జగన్ ప్రభుత్వానికి చెంప పెట్టని టిడిపి జిల్లా అధ్యక్షులు బుద్ధ నాగ జగదీశ్వరరావు, చోడవరం నియోజకవర్గం ఇన్‌చార్జి బత్తుల తాతయ్యబాబు అన్నారు. మంగళవారం అనకాపల్లి పార్లమెంటరీ పార్టీ కార్యాలయంలో నాగజగదీశ్వరరావు, బుచ్చయ్యపేట మండలం వడ్డాదిలో తాతయ్యబాబు విలేకర్ల సమావేశాల్లో మాట్లాడారు. ఐఆర్ఆర్ కేసులో సహ నిందితులపై ఉన్న ఉత్తర్వులు చంద్రబాబుకు వర్తిస్తాయని సుప్రీంకోర్టు స్పష్టం చేసిందని పేర్కొన్నారు. హైకోర్టు ఇచ్చిన తీర్పునే సుప్రీంకోర్టు సమర్థించిందని తెలిపారు. సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలకు ఇప్పటికైనా జగన్, వైసీపీ నాయకులు సిగ్గుపడాలన్నారు. ప్రతిపక్ష నాయకుల మీద తప్పుడు కేసులు పెడుతూ ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని మండిపడ్డారు.

సమగ్ర సర్వే తరువాతే పనులు

ప్రజాశక్తి-చోడవరం : ఆర్టీసీ స్థలం లీజు పేరుతో జరుగుతున్న పనులు సమగ్ర సర్వే తరువాతే చేపట్టాలని తహశీల్దారు తిరుమలబాబు స్పష్టం చేశారు. స్థానిక ఆర్టీసీ స్థలం లీజుదారులు, స్థానిక వార్డు సభ్యులకు మంగళవారం ఆర్టీసీ పాత చెరువు వద్ద ఘర్షణ చోటుచేసుకుంది. చోడవరంకు చెందిన కొంతమంది వ్యక్తులు ఆర్టీసీ స్థలాన్ని లీజుకు తీసుకున్నామని చెప్పి పాత చెరువును గ్రావెల్‌తో కప్పివేయడంతో చెరువు ఆయకట్టు రైతులు అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో తహశీల్దారు తిరుమల బాబు, ఆర్టీసీ జిఎం సుజాత స్థల పరిశీలన చేసి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తహశీల్దారు మాట్లాడుతూ సమగ్ర సర్వే జరిపి పంచాయతీ, దేవాదాయ, ఆర్టీసీ స్థలాలు ఎంతవరకు ఉన్నాయో నిర్ధారిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు నానాజీ, వార్డు సభ్యులు ఓరుగంటి నాగమణి నెహ్రూ, ఉప సర్పంచ్ వెంకటరావు, కందర్ప శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేపై ఆరోపణలు సరికాదు

ఆర్టీసీ స్థలం విషయంపై ఎమ్మెల్యే ధర్మశ్రీపై జనసేన నాయకులు ఆరోపణలు చేయడం సరి కాదని, ఇటువంటి ఆరోపణలు పునరావృతమైతే తగిన బుద్ధి చెబుతామనిఉప సర్పంచ్ పుల్లేటి వెంకట్రావు, కందర్ప శంకర్, బిఎస్ఎన్ఎల్ అడ్వైజర్ బోర్డు మెంబర్ వేచలపు ప్రకాష్, బండి శ్రీను తదితరులు హెచ్చరించారు. జనసేన నేత పీవీఎస్ఎన్ రాజు ధర్మశ్రీపై తప్పుడు ఆరోపణలు చేస్తూ మీడియాలో ప్రచారం కోసమే పాకులాడుతున్నారని విమర్శించారు.

ఎయిడ్స్ రోగులు అవగాహనతో జీవించాలి

ప్రజాశక్తి- అనకాపల్లి : ఎయిడ్స్ వ్యాధిపై పూర్తి అవగాహన కలిగించుకోవాలని, నిశ్చింతగా ప్రశాంత జీవనం గడపాలని జిల్లా కుష్టు ఎయిడ్స్ టీబీ అధికారి డాక్టర్ ఎమ్మెస్ వీకే బాలాజీ ఉద్బోధించారు. మంగళవారం తన కార్యాలయంలో యాక్సెప్ట్ ఎయిడ్స్ కంట్రోల్ అండ్ కమ్యూనిటీ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్స్ ట్రస్ట్) సహకారంతో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రోగులు అధైర్య పడకుండా మంచి పౌష్టికాహారం తీసుకోవాలన్నారు.యాక్సెప్ట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ వివిఎస్ఎస్ ప్రసాదు మాట్లాడుతూ రోగులకు ఎటువంటి కష్టం వచ్చినా తగిన సహాయ సహకారాలు అందించేందుకు ప్రభుత్వ డాక్టర్లు, స్వచ్ఛంద సంస్థలు అండగా ఉంటాయని చెప్పారు. అనంతరం దాత పి.రఘునాథరావు ఇచ్చిన పౌష్టికాహారాన్ని ఎయిడ్స్ రోగులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ విశాఖ పీడ్ణి కే.అనిల్ కుమార్, డాక్టర్ ఏ ప్రియదర్శిని డిపిఆర్ఓ డి.సాయిబాబా, యాక్సెప్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారాయణ మేనేజర్ ఎస్ గోవిందరావు డిడిఎస్ సూపర్వైజర్ కే.రవి పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని కొత్తపెంట గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని మంగళవారం స్థానిక రొంగలి వెంకటరావు (నీలిమ) ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలు వైద్యం కోసం ఎలాంటి ఇబ్బంది పడకుండా ఇంటి వద్దే పరిష్కరించే కార్యక్రమం ఆరోగ్య సురక్ష అని పేర్కొన్నారు. వేచలం పిహెచ్సి వైద్యాధికారి బి.హారిక ఆధ్వర్యంలో 391 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్పెషలిస్ట్ వైద్యులు రోజారాణి (గైనకాలజిస్ట్), మహమ్మద్ అమీర్, మాజీ సర్పంచ్ రొంగలి శంకర్రావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చోడమాంబ అమ్మవారికి జలాభిషేకం

ప్రజాశక్తి-అచ్యుతాపురం : మండలంలోని చౌడపల్లి గ్రామంలో చోడమాంబ అమ్మవారికి ఆలయ ధర్మకర్త కర్రి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో మోసయ్యపేట, రామన్నపాలెం చౌడపల్లి గ్రామాలకు చెందిన మహిళలు మంగళవారం జలాభిషేకం చేశారు. ఆయా గ్రామాల నుంచి కాలినడకన డప్పులతో అమ్మవారి ఆలయానికి తరలివచ్చారు.

గాంధీజీకి ఘన నివాళి



డైట్‌లో గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న రత్నాకర్

ప్రజాశక్తి- విలేకర్ల యంత్రాంగం

జాతిపిత మహాత్మా గాంధీ 76వ వర్ధంతి సందర్భంగా అనకాపల్లి, విశాఖ జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో మంగళవారం పలు సంస్థలు, పార్టీల ఆధ్వర్యాన గాంధీజీ చిత్ర పటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

అనకాపల్లి : స్థానిక డైట్ కళాశాలలో కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ గాంధీ విగ్రహానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో డాక్టర్ ఆర్.వైకుంఠరావు, ఎ.కృష్ణనాగ్, సుధీర్ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా జనరల్ సెక్రటరీ కాళ్ల వెంకట సత్యనారాయణ ఆధ్వర్యంలో స్థానిక గాంధీ నగరం మెయిన్ రోడ్‌లో గాంధీ విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సేనాపతి రాజు, కార్యకర్తలు పాల్గొన్నారు. టిడిపి విశాఖ జిల్లా మాజీ అధ్యక్షులు దాడి రత్నాకర్ ఆధ్వర్యంలో స్థానిక జీవీఎంసీ జోనల్ కార్యాలయంలో మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సిలపరశెట్టి బాబీ, కొత్తా గోపాలకృష్ణ, ఇతర నాయకులు పాల్గొన్నారు. మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా వై.శివరామక్రిష్ణ ఆధ్వర్యాన గాంధీజీ – మతసామరస్యం అనే అంశంపై విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు.

కశింకోట : మండలంలోని ఉగ్గినపాలెం పంచాయతీ కార్యాలయంలో ఎంపిపి కలగ లక్ష్మీ గున్నయ్య నాయుడు గాంధీ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కశింకోటలో విశ్రాంత ఉద్యోగుల పాము సూర్యనారాయణ, నంబా రమణ ఆధ్వర్యాన గాంధీజీకి శ్రద్ధాంజలి ఘటించారు. తాళ్లపాలెం శాఖా గ్రంధాలయంలో జరిగిన కార్యక్రమంలో వైసిపి నేత లగిసెట్టి గణేష్, చిన్ని భాస్కర్‌రావు, గ్రంథాలయ అధికారి కె.జగన్ పాల్గొన్నారు

దేవరాపల్లి : దేవరాపల్లి శాఖ గ్రంధాలయంలో లైబ్రేరియన్ ఓ శ్రీనివాసరావు గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్ మురళి, కే సన్యాసిరావు, ఎం రాంబాబు పాల్గొన్నారు.

నర్సీపట్నం టౌన్: పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నంగిన రమణ ఆధ్వర్యంలో మహాత్మగాంధీ వర్ధంతిని నిర్వహించారు. గాంధీ విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు మీసాల సుబ్బన్న పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాకవరపాలెం మండల అధ్యక్షులు బొంతు రమణ పాల్గొన్నారు.నర్సీపట్నం శాఖా గ్రంధాలయంలో గ్రంధాలయాధికారి పి.దమయంతి ఆధ్వర్యంలో గాంధీ చిత్రపటానికి ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు శ్రీనివాస్, రిటైర్డు టీచర్ రామచంద్రుడు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

యస్ రాయవరం : అడ్డురోడ్డులో మహాత్మాగాంధీ విగ్రహానికి సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.అప్పలరాజు, మండల కన్వీనర్ ఎం.సత్యనారాయణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. రిక్షా కార్మికులు పాల్గొన్నారు. ధర్మవరం అగ్రహారం జెడ్‌పిహెచ్‌ఎస్‌లో హెచ్ఎం ఎస్‌వి రమణారావు బాపూజీ విగ్రహానికి పూలమాలలు వేశారు పాఠశాల విద్యా కమిటీ మాజీ చైర్మన్ చందక రమణ ఉపాధ్యాయులు బి శ్రీను, గారా ప్రకాష్ , ఆర్.అప్పలనాయుడు పాల్గొన్నారు.

చీడికాడ : మండలంలోని, జైతవరం గ్రామంలో గాంధీ విగ్రహానికి ఉపసర్పంచ్ చైతన్య పూలమాల వేసిో నివాళులర్పించారు. పంచాయతీ కార్యదర్శి పట్నాల గోపి, కొల్లి నవీన్ కుమార్, విఆర్ఒ గౌరీ శంకర్, హెచ్ఎం ఆర్ .కోటేశ్వరరావు, ఎం. శ్రీను, ఎ.రమణ బాబు, మార్తా. శ్రీనివాసరావు, బొబ్బిలి దేవుళ్ళు. పాల్గొన్నారు


మాకవరపాలెం : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మహాత్మునికి ఘననివాళులర్పించారు. ఎంఇఒ విఎస్ఎన్.మూర్తి హెచ్ఎం అచ్యుతరామయ్య, ఉపాధ్యాయులు, సిఆర్ఎంటి రామచంద్ర, విద్యార్థులు పాల్గొన్నారు.

మధురవాడ : ఎండాడలోని వైసిపి కార్యాలయంలో జిల్లా సేవదాల్ అధ్యక్షులు దాడి రమేష్ ఆధ్వర్యాన మహాత్మాగాంధీ వర్ధంతిని నిర్వహించారు. కోలా గురువులు పాల్గొన్నారు. కొమ్మాది కూడలిలో ఉన్న గాంధీ విగ్రహం వద్ద సిఐటియు నాయకులు నివాళులర్పించారు. సిఐటియు జోన్ కార్యదర్శి పి.రాజ్‌కుమార్, నాయకులు డి.అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు. చంద్రంపాలెం బాపూజీ కళా మందిరం వద్ద గాంధీ విగ్రహానికి వైసిపి నాయకులు పిళ్లా కృష్ణమూర్తి పాత్రుడు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పిళ్లా సూరిబాబు, పోతిన పైడిరాజు, పిళ్లా పోతరాజు, పిళ్లా అప్పన్న పాల్గొన్నారు.

భీమునిపట్నం : స్థానిక బీచ్‌లోని మహాత్మా గాంధీ పార్కులోని విగ్రహానికి టిడిపి రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎం.సంజీవ్‌కుమార్, కనకల అప్పలనాయుడు, కాసరపు ఎల్లాజీ, వియ్యపు పోతురాజు, కొక్కిరి కిషోర్ పాల్గొన్నారు. ఆదర్శ హిందీ ప్రేమీ మండలి ఆధ్వర్యాన వర్ధంతిని నిర్వహించారు. కార్యక్రమంలో గంటా నూకరాజు, కెఎస్ఆర్.కృష్ణారావు పాల్గొన్నారు.

విశాఖ కలెక్టరేట్ : విశాఖ కలెక్టరేట్ ప్రాంగణంలోని పార్కులో గాంధీ విగ్రహానికి జెసి కెఎస్.విశ్వనాథన్ పూలమాల వేసి నివాళ్లర్పించారు. డిఆర్ఒ కె.మోహన్ కుమార్ పాల్గొన్నారు. మానవ హక్కుల కౌన్సిల్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మానవ హక్కుల కౌన్సిల్ రాష్ట్ర కార్యదర్శి మంత్రి శ్యాంప్రసాద్ పాల్గొన్నారు. తెలుగు శక్తి ఆధ్వర్యంలో జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద నివాళ్లర్పించారు. సంస్థ అధ్యక్షులు బివి.రామ్, పాలూరు శేషమాంబ పాల్గొన్నారు. కాంగ్రెస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆ పార్టీ బిసి సెల్ ఉపాధ్యక్షులు తోట వాసుదేవరావు పాల్గొన్నారు.

ఎంవిపి.కాలనీ : వైఎస్ఆర్ సెంట్రల్ పార్కు వద్ద మహాత్మా గాంధీ విగ్రహానికి జివిఎంసి అదనపు కమిషనర్లు డాక్టర్ వై.శ్రీనివాసరావు, ఎస్ఎస్.వర్మ, డాక్టర్ వి.సన్యాసిరావులు నివాళ్లర్పించారు. ఎంవిపి.కాలనీలోగల ఎస్‌వివిపివిఎంసి డిగ్రీ కళాశాలలో బాల వికాస్ ఫౌండేషన్ ఫర్ పీస్ అండ్ హార్మొనీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి నరవ ప్రకాశరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.జగదీశ్వరరావు. ఎఎస్ రాజా జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.కాసు పాల్గొన్నారు.



జాతీయ నాయకుల ఫొటోలు అందజేస్తున్న దృశ్యం

పోరాటాలతోనే దేశానికి స్వాతంత్ర్యం

ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు

ప్రజాశక్తి-అచ్యుతాపురం : మహాత్మా గాంధీ నాయకత్వంలో వివిధ తరగతులు చేసిన పోరాటాలతోనే దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు అన్నారు. మండలంలోని తిమ్మరాజుపేట ప్రాథమిక పాఠశాలలో, హెచ్ఎం మారిశెట్టి వెంకట అప్పారావు ఆధ్వర్యాన మంగళవారం జరిగిన మహాత్మా గాంధీ వర్ధంతి కార్యక్రమంలో గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అప్పారావు మాట్లాడుతూ పోరాడకుండా ఏ సమస్యా పరిష్కారం కావడం లేదన్నారు. విద్యార్థి దశ నుండే పోరాటాలు చేసిన నాయకులు దేశ నాయకులుగా రాణించారని గుర్తు చేశారు. హెచ్ఎం మారిశెట్టి వెంకట అప్పారావు మాట్లాడుతూ గాంధీజీని ఆదర్శంగా తీసుకొని ఆయన చూపిన బాటలో విద్యార్థులు పయనించాలన్నారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన శరగడం శివ బాపు నాయుడు, ఆడారి అనంతరావు, యల్లపు గోవింద, భవిరిశెట్టి రవికుమార్ జాతీయ నాయకులు చిత్రపటాలను పాఠశాలకు బహూకరించారు. కార్యక్రమంలో ఆడారి శివ అప్పలనాయుడు, కర్రి భద్రరాజు, కర్రి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

విభజన హామీలు అమలు చేయాలని నిరసన

అనకాపల్లి : రాష్ట్రానికి ఇచ్చిన విభజన హామీలను అమలు చేయాలని కోరుతూ గాంధీ వర్ధంతి సందర్భంగా ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో గాంధీజీ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. కార్యక్రమంలో సంఘం జిల్లా నాయకులు వి కన్నబాబు. వియ్యపు రాజు ఏఐఎస్ఎఫ్ నాయకులు జిల్లా బాబ్జి, ఫణీంద్ర పాల్గొన్నారు.

హత్యాయత్నం, దొంగతనం కేసులో నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి -అనకాపల్లి

అనకాపల్లి గవరపాలెంలో ఈనెల 26న ఒక వృద్ధురాలని హత్య ప్రయత్నం చేసి ఆమె మెడలో ఉన్న ఆరున్నర తులాల బంగారు నగలను దోచుకెళ్లిన సంఘటనలో పట్టణ పోలీసులు ముద్దాయిని మంగళవారం అరెస్టు చేసినట్టు ఎస్పీ మురళీకృష్ణ విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఈనెల 26న అనకాపల్లి గవరపాలెంలో నివాసముంటున్న కర్రి లక్ష్మి నారాయణమ్మను గవరపాలానికి చెందిన సిటీ కేబుల్ మెకానిక్ మల్ల గోవింద హత్య ప్రయత్నం చేసి ఆమె మెడలో ఉన్న ఆరున్నర తులాల బంగారు ఆభరణాలను దొంగలించాడు. దీంతో ఆమె స్పృహ తప్పిపడిపోయింది. ఈ సమయంలో ఆమెను చూసేందుకు వచ్చిన కుమార్తె, అల్లుడు కాండ్రేగుల నాగచంద్రిక మురళీకృష్ణ నారాయణమ్మను చూసి అవాక్కయ్యారు. వెంటనే ఆమెను స్థానిక ప్రైవేట్ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. హైదరాబాదులో నారాయణమ్మ కుమారుడు నాగరాజా వెంకట కిషోర్ కుమార్‌కు సమాచారం ఇచ్చారు. ఆయన హుటాహుటిన అనకాపల్లి చేరుకొని తన ఇంట్లో ఏర్పాటు చేసిన తన ఫోన్‌కు కనెక్ట్ చేసిన సిసి కెమెరాల ద్వారా మల్ల గోవింద తన తల్లిని మెడకు తువ్వాళ్ళతో గట్టిగా బిగించి, ఆమె మెడలో ఉన్న బంగారు ఆభరణాలను దొంగలించినట్లు గుర్తించారు. దీంతో ఆయన ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముద్దాయి గోవిందను మంగళవారం గవరపాలెం పార్కు సెంటర్లో అరెస్టు చేసి ఆయన నుంచి ఆరున్నర తులాల బంగారు ఆభరణాలు, ఒక స్కూటీని స్వాధీనం చేసుకున్నట్టు ఎస్పీ మురళికృష్ణ తెలిపారు. ఈ మీడియా సమావేశంలో అదనపు ఎస్పీలు బి.విజయభాస్కర్, పి.సత్యనారాయణ రావు, అనకాపల్లి సబ్ డివిజన్ డిఎస్పి వి.సుబ్బరాజు, అనకాపల్లి టౌన్ ఎస్‌హెచ్.ఓ జి.శంకర్రావు, ఎస్సై పి.సింహాచలం పాల్గొన్నారు.

గ్రామ సచివాలయం ప్రారంభం

ప్రజాశక్తి-అచ్యుతాపురం : మండలంలోని పూడిమడక గ్రామంలో రూ.85 లక్షలతో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని ఎలమంచిలి ఎమ్మెల్యే కన్నబాబు రాజు మంగళవారం ప్రారంభించారు. హరిపాలెం గ్రామంలో కైలాస భూమిలో నూతనంగా నిర్మించిన సామాజిక భవనాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో డిసిసిబి మాజీ చైర్మన్ యు సుకుమార్ వర్మ, సర్పంచులు చేపల సుహాసిని వెంకటరమణ, మారిశెట్టి లక్ష్మీకాంతం సూర్యనారాయణ, వైసీపీ నాయకులు కె విష్ణుమూర్తి, దేశం శెట్టి శంకర్రావు, కోన బుజ్జి, కె విమలా నాయుడు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణ, ఉపాధికి దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి -అనకాపల్లి : నేషనల్ అకాడమీ ఆఫ్ కనస్ట్రక్షన్ (నేక్) ద్వారా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ నిరుద్యోగ యువతకు ఉపాధి కొరకు ఎలక్ట్రిషియన్ కోర్సులో ఉచిత శిక్షణ, ఉపాధి నిమిత్తం నేరుగా ఎస్‌విఎస్ఎస్ దరఖాస్తులు కోరుతున్నట్లు నేక్ సహాయ సంచాలకులు రవికుమార్ తెలిపారు. అభ్యర్థులు 10వ తరగతి పాసై 15 నుండి 45 సంవత్సరాల వయసు గలవారై ఉండాలన్నారు. మహిళా అభ్యర్థులు కూడా అర్హులేనని పేర్కొన్నారు. ఆసక్తి గలవారు 7780275922 ఫోన్ నెంబర్‌కు సంప్రదించాలన్నారు.

నేడు పలు అభివృద్ధి పనులు ప్రారంభం



జోగ కొండబాబు

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం స్థానిక శాసనసభ్యులు కరణం ధర్మశ్రీ పలు అభివృద్ధి పనులను ప్రారంభిస్తారని వైసిపి మండల అధ్యక్షులు జోగ కొండబాబు తెలిపారు. పెద మదీన సచివాలయం, హెల్త్ సెంటర్, జల్ జీవన్ మిషన్ కుళాయిలు, ఆర్.శివరాంపురం, మల్లం గ్రామ సచివాలయాలు, పిపి అగ్రహారం రైతు భరోసా కేంద్రం ప్రారంభిస్తారని పేర్కొన్నారు. మండలంలోని పార్టీ నాయకులు కార్యకర్తలు హాజరు కావాలని ఆయన కోరారు.

పౌర హక్కులపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న చంద్రశేఖర్

ప్రజాశక్తి- కోటవురట్ల : పౌర హక్కుల పట్ల ప్రతి ఒక్కరూ అవగాహనతో ఉండాలని మండల పరిషత్తు పరిపాలనాధికారి చంద్రశేఖర్ అన్నారు మంగళవారం ఎండపల్లి గ్రామంలో పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన పౌర హక్కులను పొందడంతోపాటు ప్రతిపౌరుడూ తమ బాధ్యతలు నిర్వర్తించాలన్నారు. ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలు సహా భూ హక్కులు, పలు సాంఘిక కార్యక్రమాల పట్ల ప్రభుత్వ నిధులు విధులు సక్రమంగా జరిగేటట్టు పౌరులందరూ అవగాహన పెంచుకోవాలన్నారు, కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ అధికారి రాజ్యలక్ష్మి, రెవెన్యూ ఇన్స్పెక్టర్ వర్ధవరావు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

కొత్తకోట : కొత్తకోట ఎస్సి కాలనీలో మంగళవారం సాయంత్రం పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. తహసిల్దార్ మహేశ్వరరావు మాట్లాడుతూ పౌర హక్కులకు భంగం కలిగించే ఎటువంటి చర్యలైనా చట్ట వ్యతిరేకమేనని స్పష్టం చేశారు. మండల వ్యాప్తంగా ఎస్సి కాలనీల్లోని సమస్యలపై జిల్లా కలెక్టర్ నివేదిక సమర్పిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపిటిసి పూడి దేవ, దళిత బహుజన సంక్షేమ సంఘం జిల్లా కన్వీనర్ మల్లేటి రాజు,. అంబేద్కర్ సంఘం ప్రతినిధులు పూడి అప్పారావు, అర్జున్, యూత్ సభ్యులు మల్లేటి రాజా, బి మహేష్ ,కె. ప్రసాద్, పూడి నల్లయ్య పాల్గొన్నారు.

బిజెపి పాలనలో

అణగారిన వర్గాలు అధోగతి



మాట్లాడుతున్న బొట్టా నాగరాజు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : బిజెపి హయాంలో అన్ని వర్గాలకు నష్టం కలుగుతుందని బహుజన సమాజ్ పార్టీ నర్సీపట్నం అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్ధి బొట్టా నాగరాజు ఆరోపించారు. మంగళవారం విలేకర్లతో మాట్లాడుతూ దేశంలోని విశ్వవిద్యాలయాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్ ఉద్యోగాలను తీసేయాలని బిజెపి ప్రభుత్వం యుజిసిని అడ్డు పెట్టుకొని ఇష్టానుసారం మాట్లాడుతుందన్నారు. అభ్యర్థులు అందుబాటులో లేరని రిజర్వేషన్ పోస్టులను అన్ రిజర్వేడ్ చేసి, ఆ పోస్టులను అగ్రవర్ణాలతో భర్తీ చేయాలనుకోవడం దుర్మార్గమన్నారు. ఎస్సి, ఎస్టి, బిసి, మైనార్టీ నిరుద్యోగులు దీనికి వ్యతిరేకంగా పోరాటం చేయాలన్నారు. రాష్ట్రంలోని టిడిపి, వైసిపి, జనసేన పార్టీలు బిజెపికి తొత్తులుగా పని చేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో నర్సీపట్నం నియోజకవర్గ కన్వీనర్ కొల్లు గంగాధర పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ



భోజన ప్యాకెట్లు ఇస్తున్న చంద్రశేఖర్

ప్రజాశక్తి -యస్ రాయవరం: తన మిత్రుడు కర్రి రాజీవ్‌గాంధీ మొదట వర్ధంతి సందర్భంగా ఆయన జ్ఞాపకార్థం అడ్డురోడ్డు ప్రాంతంలో వృద్ధులు, దీనులకు భోజన ప్యాకెట్లు, దుప్పట్లు పంపిణీ చేసినట్టు కర్రి చంద్రశేఖర్ తెలిపారు. కర్రి రాజీవ్‌గాంధీ తమను శోకసముద్రంలో ముంచి ఏడాది క్రితం వెళ్లిపోయినా, ఇంకా మరువలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రాజీవ్‌గాంధీ కుటుంబ సభ్యులు, స్నేహితులు పాల్గొన్నారు.

నిర్వాసితులకు న్యాయం చేయకుంటే

కంపెనీలను అడ్డుకుంటాం

టిడిపి మండల అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్



మాట్లాడుతున్న వెంకటేష్

ప్రజాశక్తి, -నక్కపల్లి : వైజాగ్, చెన్నై ఇండస్ట్రియల్ కారియర్ కోసం ఎపిఐఐసి ద్వారా సేకరించిన భూములలో నిర్వాసితులకు న్యాయం చేయకుండా కంపెనీలను ఏర్పాటు చేస్తే అడ్డుకుంటామని తెలుగుదేశం పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్ హెచ్చరించారు. నిర్వాసితులకు న్యాయం చేయకుండానే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి వచ్చేనెల 2వ తేదీన అమరావతిలో బటన్ నొక్కి పరిశ్రమలు స్థాపనకు ప్రయత్నం చేస్తున్నారని ,దీనిని అడ్డుకుంటామని హెచ్చరించారు మంగళవారం నక్కపల్లిలో పార్టీ శ్రేణులతో కలిసి మాట్లాడారు. మండలంలోని ఆనాడు తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో సుమారుగా 5000 ఎకరాలు సేకరించి, చాలామంది రైతులకు, నిర్వాసితులకు అప్పట్లో పరిహారం కూడా చెల్లించి, పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు చేపట్టామన్నారు. .అయితే వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు, నిర్వాసితులకు పూర్తిస్థాయిలో ప్యాకేజీ చెల్లించ లేదన్నారు. ఆర్ఆర్ ప్యాకేజీ గానీ , ఇతర పరిహారాలు చెల్లించకుండానే పరిశ్రమలు ఏర్పాటుకు పూనుకోవడం సరైంది కాదన్నారు..పరిశ్రమల స్థాపనకు టిడిపి, జనసేన వ్యతిరేకం కాదని ,అయితే రైతులకు, నిర్వాసితులకు పూర్తిస్థాయిలో పరిహారం, ప్యాకేజీ చెల్లించకుండా ఏర్పాటు చేస్తే అడ్డుకుంటామన్నారు. నిర్వాసితులకు, రైతులకు పూర్తిస్థాయిలో ఆదుకునేందుకు తెలుగుదేశం పార్టీ పోలిట్ బ్యూరో సభ్యురాలు మాజీ ఎమ్మెల్యే వంగలపూడి అనిత ఆధ్వర్యంలో ఆందోళన, పోరాటం చేస్తామన్నారు.

మూగజీవాల సంరక్షణపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న వెటర్నరీ వైద్యులు, సిబ్బంది

ప్రజాశక్తి- చీడికాడ: మూగజీవాల సంరక్షణ, వాటి వల్ల సంక్రమించే వ్యాధులపై అవగాహన కలిగి అప్రమత్తంగా ఉండాలని చీడికాడ పశువైద్యాధికారిఇ డాక్టర్ జి.గాయత్రిదేవి సూచించారు. జంతు సంరక్షణ పక్షోత్సవాలలో భాగంగా మంగళవారం మండలంలోని దండి సురవరం గ్రామంలో రైతులకు పాడి పశువుల సంరక్షణపై సూచనలు చేశారు. ఉచితంగా గాలికుంటు వ్యాధి టీకాలు వేశారు.. పశువులకు హెల్త్ కార్డు అందించారు. రైతు భరోసా కేంద్రంలో పశుసంవర్ధక శాఖ ద్వారా అందుబాటులో ఉండే గడ్డి విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పశు వైద్యశిబిరం నిర్వహించారు.

సంక్రమిత వ్యాధులపై చైతన్యం

జంతువుల నుండి మనుషులకు సంక్రమించే వ్యాధులపై జి.కొత్తపల్లి కస్తూరిబా బాలికల విద్యా కేంద్రంలో 8వ తరగతి విద్యార్థినులకు పెద్ద గోవాడ వెటర్నరీ డాక్టర్ రాఘవమ్మ అవగాహన కల్పించారు. జంతు సంరక్షణ పక్షోత్సవాల్లో భాగంగా పెంపుడు జంతువులను ఏ విధంగా కాపాడుకోవాలి, వాటిపట్ల ఎలా వ్యవహరించాలనే అంశాలపై వివరించారు. వెటర్నరీ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

గిరిజన స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబాలను

విస్మరించడం దుర్మార్గం

జాతీయ అల్లూరి యువజన సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు పడాల



బోడిదొర కుటుంబాన్ని పరామర్శిస్తున్న అల్లూరి సంఘ సభ్యులు

ప్రజాశక్తి-గొలుగొండ : స్వాతంత్ర్య పోరాటంలో ప్రాణత్యాగాలు చేసిన గిరిజన స్వాతంత్ర్య సమరయోధులను ప్రభుత్వాలు విస్మరించడం తగదని జాతీయ అల్లూరి సీతారామరాజు యువజన సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు పడాల వీరభద్రరావు అన్నారు. మంగళవారం లంకలవీధిలో ఉన్న గాం బోడి దొర స్వగృహానికి రాష్ట్ర అల్లూరి సీతారామరాజు యువజన సంఘం ఉపాధ్యక్షురాలు వాడపల్లి వెంకటరమణ అమ్మ, కోశాధికారి శ్యామల వరలక్ష్మి, కార్యదర్శి శివంగి నాగేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు ఆడారి నాగ సత్యనారాయణ, పోతిన వెంకటేశ్వరరావు తదితరులు గాం బోడి దొర కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, స్వాతంత్ర్య పోరాటంలో బ్రిటీషర్ల తుపాకీ గుళ్ళకు బలైపోయిన గాం గంటందొర మనవడు గాం బోడిదొరను అల్లూరి సీతారామరాజు శతజయంతోత్సవాల సందర్భంగా ప్రధాని నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ప్రత్యేకించి భీమవరం సభకు రప్పించుకొని సత్కరించి, చేతులు దులుపుకున్నారని, తర్వాత పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. గంటం దొర మనవడు అనారోగ్యంతో నరకయాతనతో బతుకు ఈడుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశం కోసం ప్రాణత్యాగం చేసిన యోధుల కుటుంబాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని పడాల వీరభద్రరావు కోరారు. ఈ సందర్భంగా జాతీయ అల్లూరి యువజన సంఘం వారి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా నిచ్చారు.

అభివృద్ధి పనులు ప్రారంభం



ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఉమాశంకర్‌గణేష్

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్ : మున్సిపాలిటీలోని 6వ వార్డు, బలిఘట్టంలో నూతనంగా నిర్మించిన అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఒక్కొక్క పిహెచ్‌సిని సుమారు రూ.కోటి 9లక్షల వ్యయంతో నిర్మాణం చేపట్టామన్నారు. డాక్టర్లు, సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు. దీన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్యశాఖ అధికారి డాక్టర్ హేమంత్ మున్సిపల్ చైర్ పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణ, మున్సిపల్ కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

గొలుగొండ : మండలంలోని కొత్తమల్లంపేటలో రూ.35లక్షలతో నిర్మించిన సచివాలయ భవనం, రైతు భరోసా కేంద్రాన్ని, జోగుంపేటలో రూ.43లక్షలతో నిర్మించిన సచివాలయ భవనాన్ని ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్ ప్రారంభించారు. అనంతరం హుకుంపేట నుంచి నిమ్మగెడ్డ రోడ్డును ప్రారంభించారు.కార్యక్రమంలో జెడ్‌పిటిసి సుర్లగిరిబాబు, ఎంపిపి గజ్జలపు మణికుమారి, మండల పార్టీ అధ్యక్షులు లెక్కల సత్యనారాయణ, వైస్ ఎంపిపి జక్కు నాగమణి, సర్పంచ్‌లు పోలిరెడ్డి రాజుబాబు, జువ్వల లక్ష్మీ, పట్నాల నూకరత్నం, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఫేర్‌వెల్



నృత్యాలతో సందడి చేస్తున్న విద్యార్థినులు

ప్రజాశక్తి -కోటవురట్ల: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం ఫేర్‌వెల్ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులంతా ఉత్సాహంగా పాల్గొని, ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ సీనియర్లకు వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొని ఆటాపాటలతో సందడి చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ కొండబాబు, జయరాం, నిత్యానందం గణేష్ రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న హెటిరో కంపెనీ ప్రతినిధులు

ప్రజాశక్తి -నక్కపల్లి : మండలంలోని పెదతీనార్లలో సిమెంటు రోడ్డు నిర్మాణానికి హెటిరో కంపెనీ ప్రతినిధులు మంగళవారం శంకుస్థాపన చేశారు. కంపెనీ యాజమాన్యం ఆర్థిక సహాయంతో సుమారుగా రూ.40 లక్షలతో 1200 మీటర్ల సిమెంట్ రోడ్డు నిర్మాణం చేపట్టనున్నట్లు కంపెనీ ప్రతినిధులు వెల్లడించారు. కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు ఎస్ కుల్లాయి రెడ్డి, సుబ్బారెడ్డి, రాజారెడ్డి, సర్పంచ్ మైలపల్లి శ్రీనివాస్, ఎంపీటీసీ సభ్యులు మెరుగు నాగేశ్వరరావు, కంపెనీ స్టాఫ్ శ్రీనివాస్ పాల్గొన్నారు .

ఇక్కడా రాంకీ వంచనే..!

- కుర్చీల్లో ఆశీనులైన సంస్థ ఉద్యోగులు
- అభ్యంతరకరంగా ల్యాండ్‌ఫిల్ ప్రజాభిప్రాయ సేకరణ
- బాధిత గ్రామాల ప్రజలకు సమాచారమివ్వని అధికారులు

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి, పరవాడ విలేకరి

పారిశ్రామిక వ్యర్థాల శుద్ధి నిల్వ కేంద్రం (ల్యాండ్ ఫిల్) ఏర్పాటుపై మంగళవారం పరవాడ తహశీల్దార్ కార్యాలయం సమీపంలో నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణలోనూ రాంకీ సహా కాలుష్య నియంత్రణ మండలి, సంబంధిత అధికారులు వంచనకు పాల్పడ్డారు. కాలుష్య ప్రభావిత ప్రాంత తానాం, బిసి కాలనీ, పరవాడ, లంకెలపాలెం పరిసర ప్రాంత ప్రజలు రాకుండా కాలుష్య నియంత్రణ మండలి అధికారులు సమాచారం తెలియజేయకుండా దాచిపెట్టారు. రాంకీ తప్పిదాలపై చర్యలు తీసుకోకుండా, దాన్ని వెనుకేసుకొస్తున్న వారు చివరకు ప్రజల అభిప్రాయాలు తెలియజేయడానికి ఏర్పాటు చేసిన వేదికను రాంకీ కనుసన్నల్లో నడిపారు. కాలుష్య ప్రభావిత పంచాయతీ కార్యాలయం, సచివాలయాల వద్ద ప్రజాభిప్రాయ సేకరణ నోటిఫికేషన్‌గానీ, ఎన్విరాన్‌మెంటల్ ఇంపాక్ట్ అసెస్‌మెంట్ (ఇఐఎ) రిపోర్టుగానీ ప్రదర్శించలేదు. ల్యాండ్‌ఫిల్‌పై ప్రజాభిప్రాయ సేకరణ జరుగుతుందన్న విషయం తెలీకుండా తాడి వూర్లో మాత్రమే చాటింపు వేయించారు. ఇదే విషయంపై ప్రజాభిప్రాయసేకరణ ప్రాంగణంలో కాలుష్య ప్రభావిత ప్రజలు అధికారుల తీరు పట్ల తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేశారు. ల్యాండ్‌ఫిల్ ఏర్పాటుచేసే తాడిలో ప్రజాప్రాయ సేకరణ నిర్వహించకుండా పరవాడ తహశీల్దార్ కార్యాలయం సమీపంలో ఎందుకు పెట్టారని ప్రశ్నించారు.

రాంకీ యాజమాన్యం కాలుష్య బాధిత ప్రాంత ప్రజలకు కుర్చీలు లేకుండా చేసి రాంకీలో పనిచేస్తున్న మహిళలు, ఉద్యోగులతో కుర్చీలన్నీ నింపించింది. ల్యాండ్‌ఫిల్‌కు అనుకూలంగా తమ వాళ్లతో మాట్లాడించాలని ప్రయత్నించింది. రాంకీ కుయుక్తులు గుర్తించిన స్థానికులు తీవ్ర అభ్యంతరం తెలిపారు. రాంకీ ఉద్యోగులను బయటకు పంపించాలని పట్టుబట్టడంతో మెల్లగా కుర్చీల నుంచి వారు జారుకున్నారు. గ్రామాల్లో ఇఐఎ నివేదిక పెట్టకపోవడం, సమీప ప్రజలకు సమాచారమివ్వకుండా నిర్వహిస్తున్న ప్రజాభిప్రాయ సేకరణను వాయిదా వేయాలని బాధిత గ్రామాల ప్రజలు డిమాండ్ చేశారు. ఎలాగైనా ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించాలన్న పట్టుదలతోవున్న అధికారులు ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోలేదు. గ్రామాలకు సమాచారమిచ్చి ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించాలన్న ప్రజల డిమాండ్‌కు విలువ ఇవ్వలేదు. ఒకదశలో స్థానికేతరులు ఇక్కడ నుంచి వెళ్లిపోవాలన్న పోలీసులే తరువాత ప్రజల వాదనలోని వాస్తవాన్ని గమనించి, చివరకు ఏమీ అనలేక, సహకరించాలని కోరుకున్నారు. ఔషధ పరిశ్రమలకు ఆనుకొని బిక్కుబిక్కుమని బతుకుతున్న తాడి ప్రజలను తరలించకుండా, ల్యాండ్‌ఫిల్‌పై తొందరెందుకని ప్రజలు నిలదీశారు. కంపెనీ యాజమాన్యం ప్రయోజనాల కోసం ప్రజలకు హాని తలపెట్టవద్దని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు మంగళవారం ఉదయం 11.43 గంటలకు ప్రజాభిప్రాయసేకరణ ప్రారంభించి, మధ్యాహ్నం 12.58 గంటలకు ముగించారు. ల్యాండ్‌ఫిల్‌ను వ్యతిరేకిస్తూ 15 మంది మాట్లాడినట్లు కాలుష్య నియంత్రణ మండలి అధికారులు తెలిపారు. ల్యాండ్‌ఫిల్‌పై తమ అభ్యంతరాలను వ్యక్తం చేస్తూ సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎ.రాజు, స్థానికులు, పలు ప్రజా సంఘాల నాయకులు వేదికపై జాయింట్ కలెక్టర్ జాహ్నవికి వినతిపత్రం అందజేశారు.



ల్యాండ్ ఫిల్ ఏర్పాటుపై ప్రశ్నిస్తున్న సిఐటియు నాయకులు గనిశెట్టి సత్యనారాయణ

మ్యానిఫెస్టోపై విస్తృత ప్రచారం



ప్రచారం చేస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి -నక్కపల్లి : బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా మండలంలోని రాజయ్యపేటలో తెలుగుదేశం పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు పిక్కి గంగరాజు ఆధ్వర్యంలో మంగళవారం టిడిపి మేనిఫెస్టోపై విస్తృత ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి కరపత్రాలను పంపిణీ చేసి పథకాలపై ప్రచారం చేశారు. టిడిపి.జనసేన ఉమ్మడి మేనిఫెస్టోలో అమలు చేయనున్న సూపర్ సిక్స్, ఇతర పథకాలపై వివరించారు. చంద్రబాబుతోనే సుపరిపాలన సాధ్యమవుతుందన్నారు. టిడిపి అధికారంలోకి వస్తే ప్రతి ఇంటికి లబ్ధి చేకూరుతుందన్నారుకార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు .

టిడిపి గెలుపే లక్ష్యం కావాలి

కోటవురట్ల: రానున్న ఎన్నికల్లో టిడిపి అధికారం చేపడితే ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతుందని టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి కాశి నాయుడు అన్నారు, మంగళవారం మండలంలోని బికె.పల్లి వద్ద క్లస్టర్ల వారిగా కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి గెలుపు కార్యకర్తలు సమిష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. వైసిపి ప్రభుత్వ వైఫల్యాలు ప్రజలకు వివరించాలనికోరారు, భవిష్యత్తు గ్యారెంటీ పథకాలను ప్రజలకు వివరించడంతోపాటు బూత్‌ల వారీగా ఓటర్ల జాబితాలపై దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో బికేపల్లి సర్పంచ్ లింగన్న నాయుడు, బోడపాలెం మాజీ సర్పంచ్ సత్యనారాయణ, పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

కుష్టువ్యాధిపై అవగాహన ర్యాలీ



ప్రతిజ్ఞ చేయిస్తున్న వైద్యాధికారి శ్యామ్‌కుమార్

ప్రజాశక్తి-గొలుగొండ : కుష్టు వ్యాధి నియంత్రణకు అందరూ కృషి చేయాలని గొలుగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి శ్యామ్‌కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం గొలుగొండ ఎస్సీ కాలనీలో కుష్టు వ్యాధి అవగాహన స్పర్శ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ కుష్ఠువ్యాధిపై ప్రతిఒక్కరూ అవగాహనతో మెలగాలన్నారు. ప్రజలకు అర్థమయ్యే రీతిలో వ్యాధి లక్షణాలను గురించి క్షేత్ర స్థాయిలో వివరించాలని సూచించారు. శరీరంపై స్పర్శ లేని రాగి రంగు మచ్చ కుష్టు వ్యాధి కావచ్చుని, ఈ లక్షణాన్ని నిర్లక్ష్యం చేయకుండా వైద్య సలహా తీసుకోవాలన్నారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

యస్ రాయవరం :మండలంలోని సర్వసిద్ధి పిహెచ్‌సిలో వైద్యాధికారి డాక్టర్ ఎస్ఎస్‌వి శక్తిప్రియ అధ్వర్యంలో 'వరల్డ్ యాంటీ లెప్రసి డే' సందర్భంగా కుష్టువ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కుష్టువ్యాధి లక్షణాలను, వ్యాధి నిర్ధారణకు తీసుకోవాల్సిన చర్యలు, మందులు వాడకంపై అవగాహన కల్పించారు.కార్యక్రమంలో గ్రామసర్పంచ్ కె.గణేష్, ఆరోగ్య విస్తరణ అధికారి టి.నాగేశ్వరరావు, హెల్త్ సూపర్వైజర్ ఎస్ఎస్‌వి ప్రకాష్ , హెల్త్ విజిటర్ ఎస్.సూర్యకుమారి, ఫ్యామిలీ డాక్టర్ క్లినిక్ పర్యవేక్షకులు పిఎన్‌విఎస్.ప్రసాద్, సచివాలయం హెల్త్ సెక్రటరీ ఎం.రాజేశ్వరి ,ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్లకార్డులతో నినాదాలు చేస్తున్న వైద్యులు, సిబ్బంది

సమ్మె ఒప్పంద జిఒలు అమలు చేయాలి

మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ ఫెడరేషన్ గౌరవాధ్యక్షులు అడిగర్ల రాజు



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న రాజు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్ : నర్సీపట్నం మున్సిపాలిటీ పారిశుధ్య కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన జిఒలు అమలు చేయాలని మంగళవారం ఎపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ గౌరవ అధ్యక్షులు(సిఐటియు) అడిగర్ల రాజు కోరారు. మంగళవారం మున్సిపల్ కమిషనర్ రవిబాబుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం రాజు మాట్లాడుతూ డిసెంబరు 26 నుండి జనవరి 12వ తేదీ వరకు చేసిన సమ్మె నేపథ్యంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలకు జిఒలు ఇవ్వాలన్నారు. 12న సంక్రాంతి అలవెన్స్ ఒక్కొక్క కార్మికునికి 1000 చెల్లించుటకు, జిఒ నెంబరు 60/2020 సంక్షేమ పథకాలు అమలు కొరకు ఇచ్చిన జిఒలు అమలు చేయాలన్నారు. ఇఎస్ఐ కార్డులు ఇవ్వాలని, కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరారు.కార్యక్రమంలో ప్రెసిడెంట్ బొర్రా శ్రీనివాసరావు, కోశాధికారి ఎన్.దేముడు, కుమార్ తదితరలు పాల్గొన్నారు.

సినీ సాహిత్య పూదోటలో వేటూరి చిరంజీవి

సినీ రచయిత, దర్శకుడు జెకె.భారవికి వేటూరి పురస్కార ప్రదానం

ప్రజాశక్తి -పాయకరావుపేట : కలలు చెదిరినా పాటే, కలత చెందినా పాటే, ఎలాంటి భావాన్నైనా పలికించగలిగే శక్తి వేటూరికే సాధ్యమని, క్లిష్టమైన, సరళమైన పదాలతో గారడీ చేస్తూ ఆడుకోవడం ఆయన మాత్రమే చేయగలరని ప్రముఖ తెలుగు సినీ రచయిత, దర్శకుడు, పాటల రచయిత జెకె.భారవి తెలిపారు. మంగళవారం వేటూరి సాహితీ పీఠం, శ్రీ ప్రకాష్ కల్చరల్ అసోసియేషన్ తుని, పాయకరావుపేట ఆధ్వర్యంలో వేటూరి జయంతిని పురస్కరించుకుని ఏటా సుప్రసిద్ధ సినీ కవులకు అందించే కవితా పురస్కారాలలో భాగంగా ఈ ఏడాది త్రయోదశ వేటూరి కవితా పురస్కారాన్ని జెకె.భారవి అందుకున్నారు. ఈ సందర్భంగా సన్మానగ్రహీత జె.కె.భారవిని తుని,పాయకరావుపేటకు చెందిన పలువురు ప్రముఖులు 150 పుస్తకాలతో ఘనంగా సత్కరించారు. అన్నవరం ఎస్‌వివిఎస్ దేవస్థానం ఇఒ కోడూరి రామచంద్ర మోహన్, రసమాధురి వ్యవస్థాపక అధ్యక్షుడు పేరాల సీతారామప్రభు పాల్గొని నిర్వాహకులను అభినందించారు. ఈ సందర్భంగాభారవి మాట్లాడుతూ వేటూరి పురస్కారానికి తనను ఎంపిక చేయడం అదృష్టంగా భావిస్తున్నాన్నారు. గాయకులుగా, గేయ రచయితలుగా నేటి యువతకు చాలా అవకాశాలు ఉన్నాయని, వాక్చాతుర్యం, రచనా శైలితో వాటిని సద్వినియోగం చేసుకోవాన్నారు. అన్నమయ్య, రామదాసు, మంజునాథ సినిమాల కన్నా ఆదిశంకరాచార్య సినిమాకు యుట్యూబ్ వీక్షకులు ఎక్కువ ఉండటం తనకు వచ్చిన విజయంగా భావిస్తున్నానన్నారు. వేటూరి వంటి మహానుభావుని జయంతిని ఇంత ఘనంగా జరగడం తెలుగు సాహిత్యానికి ఇస్తున్న గౌరవమని, తెలుగు సాహిత్యానికి, సంగీతానికి తెలుగు పాటకు వన్నె తెచ్చిన వ్యక్తిగా వేటూరి చిరస్థాయిగా నిలిచిపోతారన్నారు.

వేటూరి సాహితీ పీఠం వ్యవస్థాపక కార్యదర్శి కలగ రామ జోగేశ్వర శర్మ మాట్లాడుతూ సముద్రం వంటి వేటూరి నుంచి పాటలు అలలుగా ఎగసిపడ్డాయన్నారు. శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి, వేటూరి సాహితీ పీఠం ప్రధాన కార్యదర్శి విజయ్ ప్రకాష్ మాట్లాడుతూ వేటూరి సాహితీ పీఠం ఆధ్వర్యంలో ఏటా కవితా పురస్కారాలు ప్రదానం చేయడం ఆనందంగా ఉందన్నారు. వేటూరి సాహితీపీఠం వ్యవస్థాపక అధ్యక్షులు చక్కా సూర్యనారాయణ, సభ్యులు పట్టణ ప్రముఖులు, అభిమానులు పాల్గొన్నారు.



భారవిని సత్కరిస్తున్న నిర్వాహకులు